


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 283 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 20 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE : 283 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 20 AUGUST 2026 PRICE : 1/- RS
Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# సీటు రగడ..

## సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు



- పరకాల టికెట్‌పై రేవంత్‌ను ప్రశ్నించిన కొండా సుష్మిత
- రేవూరికి టికెట్ ఎలా ఖరారు చేస్తారని నిలదీత
- టికెట్లను అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టీకరణ
- కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్న
- బీసీల పట్ల వివక్ష చూపుతున్నారని రేవంత్‌పై ఆరోపణలు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. దీనిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని సుష్మిత నిలదీశారు.

- మిగతా 2లో

# బాలికల అక్రమ రవాణా కేసులో 33 మందికి శిక్ష

## హైదరాబాద్ పోక్సో కోర్టు సంచలన తీర్పు



హైదరాబాద్ పెన్ పవర్: బాలికల అక్రమ రవాణా కేసులో హైదరాబాద్ పోక్సో ప్రత్యేక సెషన్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 33 మందిని దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. ఇందులో ఐదుగురికి జీవిత ఖైదు..

- మిగతా 2లో



# గ్రామీణ ప్రాంతాలకు అధునాతన రోడ్లు

- రాష్ట్ర అభివృద్ధికి రహదారులే ముఖ్యం
- రూ.150 కోట్లతో బైపాస్ నిర్మాణం
- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్:గ్రామీణ ప్రాంతాలకు అధునాతన రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వ ్రావు, ప్రభుత్వ విప్ చింతకుంట విజ యరమణారావులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రూ. 47 కోట్లతో సుల్తానాబాద్ నుంచి పెద్దాపూర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిం చేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి రహదారులే ముఖ్యమని, రూ. 36 వేల కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.

**రోల్ మోడల్గా తెలంగాణ - మంత్రి దుద్దిళ్ల**

తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ.. దేశానికే రోల్ మోడల్గా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పదే ళ్ల పాలనలో బీఆర్ఎస్ పెద్దపల్లికి బైపాస్ నిర్మించలేదని ఆరోపించారు. అలాగే సుల్తానాబాద్ కు సైతం అతి త్వరలోనే బైపాస్ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

# బీఆర్ఎస్ నేతల.. గృహ నిర్బంధం

## టిమ్స్‌కు వెళ్లకుండా ఆటంకాలు

- హరీష్ రావు, తలసాని, సబితా సహా పలువురు నేతల నిర్బంధం
- టీమ్స్ పై ప్రభుత్వం వాస్తవాలను దాస్తోందన్న హరీష్ రావు

హైదరాబాద్లోని సనత్నగర్లో ఇటీవల ప్రారంభమైన తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రిని సందర్శించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను బుధవారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, పార్టీ నేత మన్నె కృష్ణాంక్ను వారి నివాసాల వద్దే పోలీసులు అడ్డుకున్నారు. కోకాపేట్లోని హరీష్రావు నివాసం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి బయటకు వెళ్లకుండా నిరోధించారు. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. టిమ్స్ ఆస్పత్రి నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్లోని సనత్నగర్లో ఇటీవల ప్రారంభమైన తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రిని సందర్శించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను బుధవారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, పార్టీ నేత మన్నె కృష్ణాంక్ను వారి నివాసాల వద్దే పోలీసులు అడ్డుకున్నారు. కోకాపేట్ లోని హరీష్ రావ

- మిగతా 2లో

## నర్సంపేట బంద్ నేపథ్యంలో ముందస్తు అరెస్టు


### ఎమర్జెన్సీని తలపించే నిర్బంధాలు

### ప్రభుత్వ మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హైదరాబాద్ పెన్ పవర్: ఉమ్మడి వరంగల్ నర్సంపేట బందు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను పోలీసులు బుధవారం గృహనిర్బంధం చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కుడా మాజీ చైర్మన్

- మిగతా 2లో





## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

పెన్ పవర్ డెస్క్: త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి ప్రకటించారు.

- మిగతా 2లో



## బెట్టింగ్ యాప్స్ కేసు

### ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

- ఈడీ విచారణకు హాజరైన నటి నిధి అగర్వాల్
- బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో విచారణ
- హవాలా మార్గంలో డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు
- ఇప్పటికే పలువురు నటులను ప్రశ్నించిన ఈడీ

- మిగతా 2లో



## జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

- జమ్మూకశ్మీర్ భారత్‌లో కీలక భాగం అన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో పర్యటిస్తున్న యూఎస్ ప్రతినిధి
- భద్రత మెరుగుపడింది, ప్రయాణ ఆంక్షలు సడలించాలన్న రాయబారి
- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలతో భేటీ, లెఫ్టినెంట్ గవర్నర్‌తోనూ సమావేశం

- మిగతా 2లో

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

- మిగతా 2లో

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య..

## 27 సార్లు పొడిచిన నిందితుడు



హైదరాబాద్ పెన్ పవర్: సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమ ల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుప డిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి

- మిగతా 2లో

## మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు...

## కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..




పెన్ పవర్ డెస్క్: మేయర్, మున్సిపల్ చైర్మెన్ ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది ఏపీ అసెంబ్లీ. బుధవారం ( ఆగస్టు 19 ) సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు మంత్రి నారాయణ. ప్రస్తుతం మేయర్,

- మిగతా 2లో



## 2027 ఎన్నికలే లక్ష్యం..

## బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## కాంగ్రెస్ నాయకత్వంతో ఢీ అంటే ఢీ అంటున్న కొండా కుటుంబం

తెలంగాణ మంత్రి కొండా సురేఖ కుటుంబం కాంగ్రెస్ నాయకత్వంతో అమితుమీ తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నట్లే కనిపిస్తుంది. పరకాల నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పోటీ చేయాలని భావిస్తున్నారు. రెండు రోజుల క్రితం పరకాలలో జరిగిన సభలో మళ్లీ టిక్కెట్ ను రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఇస్తామని, ఆయనను గెలిపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో ఇక పోరాటమే శరణమ్యని కొండా కుటుంబం భావిస్తున్నట్లుంది. అందుకే హనుమ కొండలో కొండా సుస్మిత తమ సన్నిహితులు, అనుచరులతో సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి తాము గళం విప్పి పరకాల సీటును దక్కించుకోవాలని చూస్తున్నారు.

**రేవంత్ పర్యటనకు దూరంగా...**

ఇటీవల వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో రేవంత్ రెడ్డి పర్యటనకు మంత్రి కొండా సురేఖ దూరంగా ఉన్నారు. దీంతో ఇక తేల్చుకోవడానికే కొండా కుటుంబం సిద్ధమవుతుందని అంటున్నారు. ముందుగానే ముఖ్యమంత్రి టిక్కెట్లను ఎలా ప్రకటిస్తారని కొండా కుటుంబం ప్రశ్నిస్తుంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ కుటుంబానికి, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి మధ్య గ్యాప్ నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ ఆధిపత్యం, అభివృద్ధి పనుల కేటాయింపులు మరియు స్థానిక ఎమ్మెల్యేల వ్యతిరేకత కారణంగా తీవ్ర విభేదాలు తలెత్తాయి. వరంగల్ జిల్లాలో కొండా దంపతుల జోక్యంపై స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారు.మేడారం జాతర పనులు: దేవాదాయ శాఖ పరిధిలోని మేడారం జాతర టెండర్లు, రూ. 70 కోట్ల పనుల కేటాయింపు విషయంలో ప్రభుత్వ నిర్ణయాలు కొండా సురేఖకు ఆగ్రహం తెప్పించాయి.

**ప్రభుత్వ ప్రోటోకాల్ దూరంగా...**

ముఖ్యమంత్రి వరంగల్ పర్యటనకు మంత్రి కొండా సురేఖ దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.కొండా కుటుంబ సభ్యులు బహిరంగంగా మరియు సోషల్ మీడియా వేదికగా పార్టీ నాయకత్వం తీరుపై చేసిన వ్యాఖ్యలు అంతర్గత పోరును తారాస్థాయికి చేర్చాయి. కొండా సురేఖ ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరితోనూ విభేదించారు. తనకు తెలియకుండా తన దేవాదాయ శాఖకు సంబంధించి అధికారులతో కడియం సమీక్ష చేయడాన్ని తప్పుపట్టారు. దీంతో పాటు తాజాగా రేవంత్ పరకాలలో చేసిన వ్యాఖ్యలతో మరింత దూరం ఏర్పడిందని అంటున్నారు.

**సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు...**

ఈ నేపథ్యంలోనే హనుమకొండలో కొండా సుస్మిత కీలక సమావేశం నిర్వహించారు. తమ అనుచరులతో కొండా సుస్మిత సమావేశమయ్యారు. పరకాల నుంచి పోటీకి సిద్ధమైన సుస్మిత పటేల్ తనకు కాకుండా మరోసారి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఇస్తామని చెప్పడంతో ఆమె నేడు గీసుకొండలో సుస్మిత పటేల్ కీలక భేటీ నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం పొంగులేటినా లేక రేవంతా? అర్థం కావడం లేదని సుస్మిత అన్నారు. కొండా మురళి సహకారంతోనే రేవంత్ టీపీసీసీ చీఫ్ అయ్యారన్న ఆమె కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తానని రేవంత్ ఇవ్వలేదని సుస్మితా పటేల్ తెలిపారు. హామీ ఇవ్వలేదని రేవంత్ ప్రమాణం చేస్తారా? అని సుస్మితా పటేల్ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నుంచి పోటీ చేస్తానని, కాంగ్రెస్ టిక్కెట్ రాకుంటే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో ఉంటానని ఆమె హనుమకొండలో జరిగిన సమావేశంలో తెలిపారు.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు

- మొదటి పేజి తరువాయి

వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు."రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ. 1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది.

**రూపారెడ్డి**

నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం" అని ఎస్పీ వివరించారు.

## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

- మొదటి పేజి తరువాయి

బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుక వినిపించేందుకు కొత్త పార్టీ స్థాపిస్తానని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం లేకుండా దేశం సుభిక్షింగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు.

## బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు, నిధి అగర్వాల్ ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు.బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి హవాలా మార్గాల్లో ద్వారా ఆమె నగదు లావాదేవీలు జరిపారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా ఆమె అందుకున్న పారితోషికం, కమీషన్ల వివరాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. గతంలో ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి వంటి నటీనటులను అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈ జాబితాలో నిధి అగర్వాల్ కూడా చేరారు. ప్రస్తుతం అధికారులు ఆమె నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ నేతల.. గృహ నిర్బంధం

**తలసాని, సబితా హౌస్ అరెస్టు..**

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా ప్రభుత్వ చర్యలను ఖండించారు. టిమ్స్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలకు నిజా నిజాలు తెలియజేయడానికే ఆస్పత్రిని సందర్శించా లని నిర్ణయించుకున్నామని, అయితే ప్రభుత్వం పోలీ సులను ఉపయోగించి బీఆర్ఎస్ నాయకులను నిర్బంధించిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యా లను కప్పిపుచ్చుకునేందుకే అక్రమ నిర్బంధాలకు పాల్పడుతోందని విమర్శించారు. సనత్నగర్, అమీర్ పేట డివిజన్లకు చెందిన పలువురు పార్టీ ముఖ్య నాయకులను కూడా పోలీసులు గృహనిర్బంధం చేశారని చెప్పారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలోనే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. టిమ్స్ సందర్శనకు వెళ్లకుండా ముందస్తు చర్యల పేరుతో నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం, అభివృద్ధిపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగు తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రిని సందర్శించాలని నిర్ణయించుకున్నారు. అయితే శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టా మని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. ఈ పరిణా మంతో టిమ్స్ అంశం మరోసారి తెలంగాణ రాజకీ యాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సీటు రగడ..

## సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో టికెట్లను పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, నేతలు కాదని అన్నారు. తన తండ్రి కొండా మురళిని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన పెడుతున్నారని సుష్మిత ప్రశ్నించారు. కొండా మురళి సాధారణ నేత కాదని, కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో తొలుత కోరింది కొండా దంపతులేనని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సుష్మిత పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సంగారెడ్డి టికెట్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం.. పరకాల విషయంలో మాత్రం తానే ఎలా నిర్ణయం చెబుతారని నిలదీశారు.యువతకు టికెట్లు ఇవ్వాలని చెబుతూ రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తామని చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం పదవిని కాపాడుకోవాలంటే నిబద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉందంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

# బాలికల అక్రమ రవాణా కేసులో 33 మందికి శిక్ష

- మొదటి పేజి తరువాయి

మరో 28 మందికి వివిధ శిక్షలు విధించింది. తొమ్మిది మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కాగా, ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసి బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టారని ఓ మహిళా 2015లో సీఐడీకి ఫిర్యాదు చేసింది. నాలుగు నెలల పాటు వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ బలవంతంగా వ్యభిచారం చేయించారని.. పలువురితో అక్రమ సంబంధాలు పెట్టుకోవాలని బలవంతం చేశారని పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టింది.

వ్యభిచార గృహాలపై దాడులు చేసి తొమ్మిది మంది మైనర్ బాలికలను నిందితుల చెర నుంచి రక్షించారు. ఏ1 నుంచి ఏ45 వరకు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నిందితులపై పోక్సో, ఐపీసీ, ఇమ్మోరల్ ట్రాఫిక్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం 2026, ఆగస్ట్ 19న హైదరాబాద్ పోక్సో ప్రత్యేక సెషన్ కోర్టు ఈ కేసులో చారిత్రాత్మక తీర్పు వెలువరించింది.

విచారణలో సీఐడీ మహిళా భద్రత విభాగం బలమైన సాక్ష్యాలు సమర్పించడంతో ఈ కేసులో న్యాయస్థానం మొత్తం 33 మందికి శిక్షలు ఖరారు చేసింది. ఇందులో ఐదుగురికి జీవిత ఖైదు, ముగ్గురికి 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, 4 మందికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, 11 మందికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితులకు విధించిన జరిమానాను కూడా బాధితులకు పరిహారంగా ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

## 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు. దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు. 2007 నాటి

"సర్వజన్" (అన్ని వర్గాల హితం) నినాదాన్ని పునరావృతం చేస్తూ, ఈసారి కూడా అగ్రవర్ణాలకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని సీట్లు కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. గతంలో 2007లో "హాథీ నహీ గణేశ్ హై.. బ్రహ్మ, విష్ణు, మహేశ్ హై" అనే వినూత్న నినాదంతో బీఎస్పీ 206 స్థానాలను కైవసం చేసుకుని, 30 శాతం ఓట్ షేర్‌తో అధికార పీఠాన్ని అధిష్టించింది. అయితే, ఆ తదుపరి ఎన్నికల్లో పార్టీ ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక స్థానానికి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సున్నా స్థానాలకు పార్టీ పరిమితమైంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని సుమారు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండగా, మాయావతి అనుసరిస్తున్న ఈ పాత ఫార్ములా ఆమెకు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందా అనేది వేచి చూడాలి.

# జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు

## బీఆర్ఎస్ నేతల.. గృహ నిర్బంధం

- మొదటి పేజి తరువాయి

) నివాసం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి బయటకు వెళ్లకుండా నిరోధించారు. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. టిమ్స్ ఆస్పత్రి నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. టిమ్స్ ను తామే నిర్మించామని ప్రభుత్వం చెబుతుంటే, వాస్తవాలు ప్రజలకు తెలియకుండా బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటు న్నారని ప్రశ్నించారు. ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన నిజాలు బయటపడతాయనే భయంతోనే ప్రభుత్వం హౌస్ అరెస్టులకు పాల్పడుతోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించకుండా అడ్డుకోవడం దురదృష్టకర

## నర్సంపేట బంద్ నేపథ్యంలో ముందస్తు అరెస్టు

- మొదటి పేజి తరువాయి

మంత్రి యాదవ్డిని వారి నివాసాల వద్దే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను వరుసగా గృహ నిర్బంధం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తోందని ఆరోపించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రభుత్వానికి అనుకూ లంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్రెడ్డి విగ్రహం తొలగింపును నిరసిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా బంద్కు మద్దతు తెలుపుతున్నారని, విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శిస్తూ, ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.ద

## మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..

- మొదటి పేజి తరువాయి

మున్సిపల్ చైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న క్రమంలో ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ఈ చట్ట సవరణను ప్రతిపాదించింది ప్రభుత్వం. ఈ సందర్భంగా సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 1986 వరకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని... అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని.. 2005 నుంచి ఇప్పటివరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని అన్నారు నారాయణ. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.

**ప్రత్యక్ష ఎన్నికలతో అనేక ప్రయోజనాలు**

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు మంత్రి నారాయణ.ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్, చైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని అన్నారు.

ప్రత్యక్ష ఎన్నికల విధానంతో మేయర్, చైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుంది.

రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే అవకాశం ఉంటుంది.

అభివృద్ధి పనుల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం, పనులు వేగవంతం.

నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని చురుకుగా ప్రోత్సహించేందుకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌కు మరింత అవకాశం ఉంటుంది.

ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా చైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.

# మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఊరట..
# లైంగిక వేధింపుల కేసు కొట్టివేత

- పెళ్లిపేరుతో లైంగికంగా వేధించారంటూ యువతి ఫిర్యాదు
- ప్రైవేట్ ఫొటోలతో కాంతారావు బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపణ
- రియల్ ఎస్టేట్ పేరిట రూ.రూ.4 లక్షలు తీసుకున్నారని ఆరోపణ
- ఇరుపక్షాల వాదనలు విని కేసు కొట్టివేసిన హైకోర్టు



హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును న్యాయస్థానం కొట్టివేసింది. పెళ్లి పేరుతో ఓ యువతిని లైంగికంగా వేధించారని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కాంతారావుపై కేసు నమోదైంది.తన ప్రైవేట్ ఫొటోలతో కాంతారావు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని

- మిగతా 4లో...

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

# మంత్రి కొండా సురేఖకు
# షోకాజ్

- కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలన్న క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ
- చిన్నారెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి కందికి సైతం నోటీసులు
- ఎల్బీనగర్ సీనియర్ నేత జక్కిడి సస్పెన్షన్
- నేతల మధ్య విభేదాలు, పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్న ఏఐసీసీ



హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సొంత పార్టీ నేతల తీరును అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీని బద్నాం చేసేలా వ్యవహరిస్తున్నందున వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాజాగా ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ వివరణ కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ(డీఏసీ) బుధవారం షోకాజ్ నోటీసులు జారీచేసింది.రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, అదే మున్సిపాలిటీ కౌన్సిలర్ సంజయ్‌లకు సైతం నోటీసులు ఇచ్చింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎల్బీనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పలువురిని వ్యక్తిగత

-5 లో

- దుండిగల్ సర్కిల్‌లో రూ.70 లక్షల డ్రైనేజీ పనులపై జెడ్‌సి సమీక్ష..
- డి.పోచంపల్లి చింతలకుంట చెరువును జోనల్ కమిషనర్ ఆకస్మిక సందర్శన..
- చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం..
- వర్షాకాలంలో వరద ముప్పు లేకుండా స్టోర్మ్ వాటర్ డ్రైనేజీపై దృష్టి సారించాలి..
- నార్లకుంట చెరువుకు స్టోర్మ్ వాటర్ మార్గంలో నిర్వహణకు ఆదేశాలు..
- వర్షాకాలం ఇబ్బందులకు ముందే శాశ్వత పరిష్కారంపై ఫోకస్ పెట్టాలని సూచనలు..
- ఇరిగేషన్-జీహెచ్ఎంసీ సమన్వయంతో పనులు వేగవంతం చేయండి: జెడ్‌సి..






# దుండిగల్ సర్కిల్‌లో..!
# జోనల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన

దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 19:

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ దొమ్మర పోచంపల్లి పరిధిలోని చింతలకుంట చెరువును బుధవారం ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు.. చెరువు అభివృద్ధి, సుందరీ కరణతో పాటు వర్షాకాలంలో నీటి ప్రవాహానికి సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి చెరువు పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. చెరువు సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.. చింతలకుంట లేక్‌ఐడి నెం.2833 చెరువు, ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యం, పరిసర ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చెరువు సుందరీకరణ, అభివృద్ధికి తక్షణమే సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. చెరువు అభివృద్ధి పనులు కేవలం సుందరీకరణకే పరిమితం కాకుండా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

-4లో



## కొత్త సవాళ్లకు అనుగుణంగా పునర్‌వ్యవస్థీకరణ: డీజీపీ

హైదరాబాద్ పెన్ పవర్:మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా రాష్ట్ర పోలీస్ శాఖలో మానవ వనరులను పునర్‌వ్యవస్థీకరిస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండగా.. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్ ఇబ్బందులు, ఆహార కల్తీ, రోడ్డు ప్రమాదాలు కొత్త సవాళ్లుగా మారాయన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. కొత్త సవాళ్లను అధిగమించేందుకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ లాంటి ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని 8 విభాగాలకు కేటాయించామన్నారు. కొత్త బాధ్యతలు అప్పగించే ముందు రెండు నెలల పాటు ఎటాచ్‌మెంట్‌పై పని చేయించామన్నారు. ఇంటర్వ్యూలతో పాటు అకాడమీలో 11 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించడం, ఓ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో 70శాతం మంది డ్రగ్స్ బారిన పడినట్లు తేలిన నేపథ్యంలో డ్రగ్స్ సరఫరా గొలుసును అడ్డుకోవడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. సమావేశంలో ఆక్టోపస్, సీఐడీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# చెల్లింపుల్లో ప్రాధాన్యాలేంటి?

- పరిహారం అందక కోర్టుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు
- మరోవైపు సంక్షేమ పథకాలకు చెల్లింపులు చేస్తున్నారు
- పథకాలకు చట్టబద్ధత ఏమిటో చెప్పండి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై హైకోర్టు వ్యాఖ్యలు
- స్టే తొలగింపుపై నేడూ కొనసాగనున్న విచారణ
- కౌంటరు దాఖలు చేసిన ప్రభుత్వం

హైదరాబాద్ పెన్ పవర్:: నిధుల వినియోగానికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకోవడానికి ఈ కోర్టుకు ఆసక్తి లేదని, అయితే ప్రజాధనం చెల్లింపుల వ్యవహారంలో ప్రభుత్వానికున్న ప్రాధాన్యాలేమిటో తెలియాల్సిన అవసరం ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఓవైపు ఉన్న ఎకరా, అరెకరాను ప్రభుత్వానికిచ్చి పరిహారం కోసం సన్నకారు రైతులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతుంటే మరోవైపు సంక్షేమ పథకాలకు చెల్లింపులు చేస్తున్నారని పేర్కొంది. సంక్షేమ పథకాలకు ఈ కోర్టు వ్యతిరేకం కాదని, ప్రజాధనం చెల్లింపుల్లో ప్రాధాన్యం ఉండాలన్నదే తమ ఉద్దేశమని వ్యాఖ్యానించింది. భూసేకరణలో భూమిని కోల్పోయిన బాధితులు కోర్టు ధిక్కరణ కేసులు వేస్తున్నారని, అధికారులు కోర్టులకు వచ్చి చెల్లింపులకు నిధుల కొరత ఉందని చెబుతున్నారని తెలిపింది. రుణాలు చేసి సంక్షేమ పథకాలను అమలు చేస్తారా అంటూ ప్రశ్నించింది.ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తీసుకువచ్చి

-5 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పాలిటెక్నిక్ విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

## పోలీసులు గొంతు నొక్కారని ఆందోళన



మహబూబాబాద్, పెన్ పవర్: పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేసేలా ఇచ్చిన జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పాలిటెక్నిక్ విద్యార్థులు కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు చేసిన ప్రయత్నం ఉద్రిక్తతకు దారితీసింది. విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ కలెక్టరేట్ గేటును తోసుకుంటూ లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా మహబూబాబాద్ పట్టణ సీఐ రఘుపతిరెడ్డి నేతృత్వంలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల సంఖ్య తక్కువగా ఉండడం, విద్యార్థులను నిలువరించే యత్నంలో ఇరువర్గాల మధ్య కొంతసేపు తోపులాట జరిగింది.సీఐ రఘుపతిరెడ్డి ఒకరిద్దరు విద్యార్థుల గొంతు పట్టుకొని వెనక్కి నెట్టుకుంటూ వెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

-4 లో

- దుండిగల్ సర్కిల్‌లో రూ.70 లక్షల డ్రైనేజీ పనులపై జెడ్‌సి సమీక్ష..
- డి.పోచంపల్లి చింతలకుంట చెరువును జోనల్ కమిషనర్ ఆకస్మిక సందర్శన..
- చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం..
- వర్షాకాలంలో వరద ముప్పు లేకుండా స్టోర్మ్ వాటర్ డ్రైనేజీపై దృష్టి సారించాలి..
- నార్లకుంట చెరువుకు స్టోర్మ్ వాటర్ మార్గంలో నిర్వహణకు ఆదేశాలు..
- వర్షాకాలం ఇబ్బందులకు ముందే శాశ్వత పరిష్కారంపై ఫోకస్ పెట్టాలని సూచనలు..
- ఇరిగేషన్-జీహెచ్ఎంసీ సమన్వయంతో పనులు వేగవంతం చేయండి: జెడ్‌సి..




# దుండిగల్ సర్కిల్‌లో..!
# జోనల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన



దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 19:
కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ దొమ్మర పోచంపల్లి పరిధిలోని చింతలకుంట చెరువును బుధవారం ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు.. చెరువు అభివృద్ధి, సుందరీ కరణతో పాటు వర్షాకాలంలో నీటి ప్రవాహానికి సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి చెరువు పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. చెరువు సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.. చింతలకుంట లేక్‌ఐడి నెం.2833 చెరువు, ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యం, పరిసర ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చెరువు సుందరీకరణ, అభివృద్ధికి తక్షణమే సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. చెరువు అభివృద్ధి పనులు కేవలం సుందరీకరణకే పరిమితం కాకుండా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

## శాఖలు సమన్వయంతో పనులు వేగవంతం..

చెరువులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి సంబంధించి దుండిగల్ సిఎంసి, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ సూచించారు.. క్షేత్రస్థాయిలో  సమస్యలు గుర్తించి, వాటికి అనుగుణంగా సాంకేతికంగా సాధ్యమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సక్కుబాయి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రమణ్యం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ రవి, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## స్టోర్మ్ వాటర్ డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి..!

వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో నీరు నిలిచిపోకుండా, వరదనీరు సక్రమంగా ప్రవహించేలా చింతలకుంట చెరువు నుంచి నార్ల చెరువుకు వెళ్లే స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించారు. డ్రైనేజీ మార్గంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన మెరుగుదలలు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.. భవిష్యత్‌లో వర్షపు నీటి ప్రవాహం కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు..

## రూ.70 లక్షల డ్రైనేజీ పనులపై సమీక్ష..!

దుండిగల్ సర్కిల్ పరిధిలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ పనులపై కూడా జోనల్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ఆయా పనులను ఏ విధంగా చేపట్టాలి, నీటి ప్రవాహానికి అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఎలా ఏర్పాటు చేయాలనే అంశాలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం చేపట్టే డ్రైనేజీ పనులు భవిష్యత్‌లో పెరిగే జనాభా, నిర్మాణాలు, అధిక వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉపయోగకరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు.. ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు..



---

# మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఊరట..
# లైంగిక వేధింపుల కేసు కొట్టివేత

-3 పేజి తరువాయి
యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే రియల్ ఎస్టేట్ వ్యవహారం పేరుతో తన వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారని కూడా ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కాంతారావును అదుపులోకి తీసుకున్నారు.
తనపై నమోదైన కేసును సవాల్ చేస్తూ రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఆయనపై నమోదైన కేసును కొట్టివేసింది.

# పాలిటెక్నిక్ విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

-3 పేజి తరువాయి
ఆయన తీరును నిరసిస్తూ విద్యార్థులు ఆందోళనను ముమ్మరం చేశారు. కాసేపటికి అదనపు పోలీసులను రప్పించడంతో.. వారు ఒక్కొక్క విద్యార్థిని బయటకు తీసుకెళ్లి గేటును మూసివేశారు. దీంతో విద్యార్థులు గేటు బయట రెండు గంటలపాటు బైఠాయించి నినాదాలు చేశారు. డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోతు సాయికుమార్, కోశాధికారి గుగులోతు సూర్యప్రకాశ్‌లు మాట్లాడుతూ.. 'ఈసెట్' రద్దుతో పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో చేరే అవకాశం కోల్పోతారన్నారు. పాలిటెక్నిక్‌లకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



రూ.20 వేలు లంచం తీసుకుంటూ.. ఏసిబికి పట్టుబడిన టిపిఎస్ ప్రభావతి..

# రూ.20 వేలు లంచం తీసుకుంటూ... ఏసీబీ వలలో "టిపిఎస్"..!

- జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతిని అరెస్ట్ చేసిన అనీశా..!
- బిల్డింగ్ పర్మిషన్ ఫైల్ ప్రాసెసింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమన్స్‌మెంట్ లెటర్‌కి లంచం.
- రూ.20 వేల లంచం డిమాండ్ చేసిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి..
- ఏసిబి ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనీశా అధికారులు..
- గతంలో కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్- 25 (ప్రస్తుతం కుత్బుల్లాపూర్ జోన్)
- జీడిమెట్ల ఫాక్స్ సాగర్ నాలా మీదనే మార్వాడి అక్రమ నిర్మాణం నేటికీ సాక్ష్యం..
- సంబంధిత అక్రమ నిర్మాణానికి కీలకంగా సహకరించిన అధికారుల్లో ప్రభావతి ఒకరు..
- టిపిఎస్ ప్రభావతిపై అప్పట్లో లిఖిత పూర్వక ఫిర్యాదుల నేపథ్యంలోనే బదిలి..?

సంతోష్‌నగర్ సర్కిల్-25, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ప్రభావతి ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు మంగళవారం పట్టుకున్నారు.. అయితే టిపిఎస్ ప్రభావతి గతంలో కుత్బుల్లాపూర్ సర్కిల్25లో సుదీర్ఘంగా విధులు నిర్వర్తించారు.. ఆమె కుత్బుల్లాపూర్‌లో చారిత్రక ఫాక్స్ సాగర్ నాలా నడిబొడ్డున నిర్మించిన మార్వాడి అక్రమ నిర్మాణానికి సహకారించిన అధికారుల్లో, అప్పట్లో టిపిఎస్ ప్రభావతిది కూడా కీలకపాత్ర.. కాకపోతే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న ప్రస్తుత పలు సిఎంసి సర్కిల్‌లలో రాజకీయ సిఫార్సులు ఉన్నందున టిపిఎస్ ప్రభావతిపై ఏసిబి ప్రభావం పడలేదని ఆరోపణలు ఉండగా.. చార్మినార్ జోనలో ఉన్నపళంగా దొరికి పోవడంపై కుత్బుల్లాపూర్ జోన్‌లో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. మరోవైపు దుండిగల్ సర్కిల్-59, నిజాంపేట్ సర్కిల్-58, కొంపల్లి, జీడిమెట్ల, గాజులరామారం సర్కిల్‌లలో అక్రమ నిర్మాణాల దందాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై అవినీతి నిరోధక శాఖ దృష్టి సారించాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు..

హైదరాబాద్, పెన్ పవర్, ఆగష్టు 19:

చార్మినార్ జోన్ జీహెచ్ఎంసి పరిధిలో (ఆగష్టు 18న) భవన నిర్మాణ అనుమతి ఫైల్ ప్రాసెస్ చేసి, బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమన్స్మెంట్ లెటర్ మంజూరు చేసేందుకు, రూ.20 వేల లంచం డిమాండ్ చేసిన, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టిపిఎస్) ప్రభావతి ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు.. ఓ ఫిర్యాదుదారుడి భవన నిర్మాణ అనుమతి ఫైల్‌ను ప్రాసెస్ చేయడంతో పాటు బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమన్స్మెంట్ లెటర్ అందించేందుకు ప్రభావతి రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. లంచం తీసుకుంటున్న సమయంలోనే ఆమెను ఉన్నపళంగా పట్టుకున్నారు.. ఆమె వద్ద నుంచి రూ.20 వేల లంచం మొత్తాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిగా విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమార్జనే ధ్యేయంగా, లంచం తీసుకున్నట్లు ఏసీబీ పత్రికా ప్రకటనలో పేర్కొంది.. అనంతరం నిందితురాలిని రిమాండ్ నిమిత్తం నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ వ్యవహారంపై కేసు దర్యాప్తు కొనసాగుతోందని అనీశా తెలిపింది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదు.. లంచం డిమాండ్ చేసే ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు

## ఫాక్స్ సాగర్ నాలాపై మార్వాడి అక్రమ నిర్మాణం..




జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ నాలాపై ఈ అక్రమ నిర్మాణంలోనూ ప్రభావతి కీలక సహకారం. (ఫైల్‌ఫొటో)




ఫాక్స్ సాగర్ నాలాపై నిర్మాణం ప్రారంబ


పెన్ పవర్ PEN POWER

శనివారం 24 జనవరి 2026 పెన్ పవర్ 3

పెన్ పవర్ తెలంగాణ రౌండప్

ఫాక్స్‌సాగర్ 'నాలా' కబ్జాలపై..
'విజిలెన్స్' కొరడా..!

అడ్డుకోలేకపోయిన జీహెచ్ఎంసి అధికారి "టిపిఎస్" అంటూ విజిలెన్స్ నివేదిక..!

- 'పెన్ పవర్' వందల కథనాల తర్వాత ఒక్క టిపిఎస్‌పై మాత్రమే విజిలెన్స్ విచారణ..?
- శాఖాపరమైన విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు..
- 2026 జనవరి 2న జీహెచ్ఎంసి కమిషనర్‌ను విచారణకు ప్రభుత్వం ఆదేశం..
- విచారణలో తాజా పరిస్థితిపై స్పష్టమైన నివేదిక పెండింగ్..?

-4లో

epaperpenpower.in
24 Jan 2026 - Page 3

---

# చెల్లింపుల్లో ప్రాధాన్యాలేంటి?

-3 పేజి తరువాయి

ఆ లాభాలను సంక్షేమ పథకాలకు వెచ్చించవచ్చుంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై స్టే తొలగించాలన్న ప్రభుత్వ విజ్ఞప్తి నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టాల్సి ఉందంటూ గురువారానికి వాయిదా వేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ పిటిషన్ విచారణార్హం కాదని, ప్రభుత్వం నుంచి తప్పు ఉంటే పిటిషన్‌ల ద్వారా నిలదీయవచ్చని, ఇది బాల్య వివాహాలను అరికట్టడానికి, బాలికా విద్యను ప్రోత్సహించడానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకమన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు అమల్లో ఉన్నాయన్నారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ పథకాల అమలుకు చట్టబద్ధత గురించి చెప్పాలని, ప్రభుత్వ జీవోలు, ఆర్థిక శాఖ అనుమతులు సరిపోతాయా అంటూ ప్రశ్నించగా అదనపు ఏజీ సమాధానమిస్తూ పథకం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నారని, దాన్ని శాసనసభ ఆమోదిస్తుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పిటిషనర్ వాదనలు వినిపిస్తూ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి చట్టబద్ధమైన అనుమతుల్లేకుండా నిధులు వినియోగించరాదన్నారు. ఏఏజీ వాదనలు కొనసాగిస్తూ కౌంటరు దాఖలు చేశామని, ప్రస్తుతం పిటిషనర్ లేవనెత్తిన అంశాలపై సమగ్ర కౌంటరు దాఖలు చేస్తామని.. స్టే ఎత్తివేయాలని కోరగా న్యాయమూర్తి స్పందిస్తూ దీనిపై సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందంటూ విచారణను గురువారానికి వాయిదా వేశారు.

**సామాజిక మాధ్యమాల్లో కథనాలొద్దు**

ఈ పిటిషన్‌పై విచారణకు సంబంధించిన అంశాలపై ఎలాంటి కథనాలు రాకూడదని సామాజిక మాధ్యమాలకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

తెలుగుస్క్రైబ్‌తో సహా సామాజిక మాధ్యమాల్లో ఈ కథనానికి సంబంధించి ఉన్న అంశాలను తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుత పిటిషన్ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ఈ కథనాలను ఉంచి బెదిరింపులకు దిగుతున్నారని, రక్షణ కల్పించాలంటూ పిటిషనర్ దాఖలు చేసిన దరఖాస్తుపై ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# మంత్రి కొండా సురేఖకు షోకాజ్

-3 పేజి తరువాయి

విషయాలపై కులాల పేరుతో దూషించిన ఘటనలపై ఆధారాలుండడంతో జక్కిడిపై చర్యలు తీసుకున్నట్లు కమిటీ తెలిపింది.

**మంత్రి కుమార్తె వ్యవహారశైలితో..**

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి గతంలో ఒకసారి, ఇప్పుడు మళ్లీ సీఎంపై, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. మంత్రి కుటుంబ సభ్యురాలే ఇలా పార్టీని, ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలుచేసేలా మాట్లాడితే ఇక కార్యకర్తలకు ఏం చెబుతారని పార్టీ ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో సుస్మిత ఆరోపణలు చేసినప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు మళ్లీ మాట్లాడటానికి అవకాశం ఉండేది కాదని నేతలు చెబుతున్నారు. ఇంతవరకూ పార్టీలో ప్రత్యక్షంగా పనిచేయకుండానే నేరుగా తనకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఇచ్చి తీరాలని ఏ హోదాతో సుస్మిత అడుగుతారని..?, ఇలా పార్టీని బెదిరించే ధోరణిలో మాట్లాడటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కుమార్తె వ్యాఖ్యలపై సురేఖను డీఏసీ వివరణ కోరింది.

**చిన్నారెడ్డి తీరుపై ఎమ్మెల్యే ఫిర్యాదులు**

గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు తీసుకుని టికెట్లు ఇచ్చారని రాష్ట్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉన్న చిన్నారెడ్డి ఆరోపణలు చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి... పీసీసీ, డీఏసీ, ఏఐసీసీలకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో చిన్నారెడ్డి ఆరోపణలను తీవ్రంగా పరిగణించి.. వెంటనే విచారణ చేయాలని డీఏసీకి చెప్పడంతో పాటు, ఏఐసీసీకి కూడా వివరాలు పంపినట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. చిన్నారెడ్డికి గత అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక పరిస్థితులతో టికెట్ ఇవ్వలేకపోయిన కారణంగానే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవిని ఇచ్చినా ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణిస్తోంది. తనకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ టికెట్.. తన కుమారుడికి కూడా పార్టీ టికెట్ కోసం ఆయన పట్టుబడుతున్నారని.. వాటిపై పార్టీ నుంచి హామీ రానందునే నేరుగా తీవ్ర ఆరోపణలు చేశారని చిన్నారెడ్డి వ్యతిరేక వర్గీయులు చెబుతున్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కూడా ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టేలా ఆరోపణలు చేయడంపై ఏఐసీసీ.. పీసీసీని వివరణ అడిగింది. తనకు మంత్రిపదవి రాలేదని ఎప్పటి నుంచో ఆయన పార్టీ, ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, ఆయనను ఇంతవరకూ డీఏసీ వివరణ అడగలేదని తెలుస్తోంది.

ఇక ఆదిలాబాద్ నియోజకవర్గంలో మున్సిపల్ సభ్యుడు సంజయ్, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డిలు విభేదాలతో రచ్చకెక్కారు. ఇటీవల ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి సచిన్ సావంత్ నిర్వహించిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో వీరు బహిరంగ విమర్శలతో వ్యవహరించిన తీరు సరిగా లేదని, మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని డీఏసీ బుధవారం జారీచేసిన షోకాజ్ నోటీసుల్లో కోరింది. పార్టీని దెబ్బతీసేలా వ్యవహరించేవారు ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని.. విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని డీఏసీని ఆదేశించినట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'ఈనాడు'కు చెప్పారు. వారందరిపై విచారణ జరిపి చర్యలకు పీసీసీకి నివేదిస్తామని క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించడంతో పాటు సాంకేతిక విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. కారేపల్లి మండల పరిధిలోని ఎస్సీ వసతి గృహ విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, వాటి బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్య విధానంలోకి తీసుకెళ్లే చర్యలను తక్షణమే నిలిపివేయాలని కోరారు.జీవో నంబర్ 97/2026లో పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి ఉపయోగపడే లాటరల్ ఎంట్రీ అవకాశాలను కొనసాగించాలని, వాటిని కోల్పోయే పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని సాంకేతిక విద్యకు కీలకమైన స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ) పాత్రను కొనసాగిస్తూ మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రభుత్వం తీసుకురావాలని చూస్తున్న శక్తి విధానం వల్ల విద్యార్థులు ఉన్నత విద్యలోకి వెళ్లే అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని శివ నాయక్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శక్తి విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో అమలు చేస్తున్న జీవో నంబర్ 97/2026ను తక్షణమే వెనక్కి తీసుకుని రద్దు చేయాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణకు అప్పగించే చర్యలను నిలిపివేయాలని పీవైఎల్ తరఫున భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు.

## హుస్నాబాద్ యోజకవర్గంలో 'పల్లె పల్లెకు' పొన్నం అన్న

# పల్లె పల్లెలో ప్రజా పాలన

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, హుస్నాబాద్ నియోజకవర్గం, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి
పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దుద్దెనపల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు.

అనంతరం రైతు వేదికలో నిర్వహించిన పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా ప్రజా పాలన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో మంత్రి నేరుగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దుద్దెనపల్లిలో ప్రజా పాలన ద్వారా జరిగిన అభివృద్ధి:
ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దుద్దెనపల్లి గ్రామంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. సైదాపూర్ మండలంలో మొదటి దశలో 486 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 370 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 170 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. నియోజకవర్గాన్ని గుడిసెలు లేని నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యం. అత్యంత పేదలు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యతతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. దుద్దెనపల్లిలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 29 ఇళు పూర్తయ్యాయి. ఇద్దరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేమని రద్దు చేసుకున్నారు.గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగంగా..గౌరవెల్లి ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని, ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గౌరవెల్లి కాలువలకు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పారు.ఎల్ఎండీ నుంచి వచ్చే నీటి ప్రాజెక్టు చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ముఖ్యమంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపించామని, త్వరలోనే అనుమతి వస్తుందని తెలిపారు. ఎంఎంఆర్ కింద ఆగిపోయిన పనులకు కూడా త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, గ్రామ సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, రైతులు,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగులారా మీరు చేసే యుద్ధంలో మేమే ముందుంటాం:

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ పెన్ పవర్:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటో గ్రాఫర్లను సన్మానించిన కేంద్ర మంత్రి
ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 27 నుండి ఉద్యోగ సంఘాల జేఏసీ చేపట్టిన పోరుబాటకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే యుద్ధంలో బీజేపీ సైనికులే ముందుండి పోరాడేందుకు సిద్ధమన్నారు. ఈ యుద్ధంలో మీ కంటే ముందు మేమే ఉంటాం. పోలీసులు లాఠీఛార్జ్ చేస్తే ఆ దెబ్బలు మేమే తింటాం. తూటాలు పేలిస్తే ఆ తూటాలకు మేమే బలయ్యేందుకు సిద్ధం అని భరోసా ఇచ్చారు. జేఏసీలో ఒకరిద్దరు నాయకులు ప్రభుత్వానికి అమ్ముడుపోయి ఉద్యమాన్ని వాయిదా వేయడం పరిపాటిగా మారిందని, అట్లాంటి వాళ్లను ఇకపై జేఏసీలో కొనసాగించవద్దని కోరారు. గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం, అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు.

ఈరోజు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గ్రుహంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. సమాజానికి ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తదితరులతో కలిసి ఉద్యోగుల జేఏసీ పోరుబాటుకు మద్దతుగా



మాట్లాడారు.
కరీంనగర్ డెయిరీ విషయంలో రాజకీయ కోణంలో చూడొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నా. సాఫీగా సాగుతున్న కరీంనగర్ డెయిరీ ని దెబ్బతీసి వాళ్ల ఆస్తులపై కన్నేయడం సరికాదు. లక్షలాది మంది రైతులకు మేలు చేసే సంస్థ. కక్ష సాధింపు చర్యలు సరికాదు. ఏదో ఒక పేరుతో బాగా నడిచే కరీంనగర్ డెయిరీని అప్రదిష్టపాల్జేసి రైతులకు అన్యాయం చేయాలని చూడటం దుర్మార్గం. ఒక వ్యక్తిని లక్ష్యం చేసుకుని వ్యవస్థను దెబ్బతీయడం దారుణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రత్యేకంగా ఈ డెయిరీపై ద్రుష్టి పెట్టాలి. న్యాయం చేయాలి. ప్రభుత్వం పక్షాన సాయం చేయకపోయినా ఫరవాలేదు దయచేసి అన్యాయం చేయొద్దని కోరుతున్నా.

# పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను సాంకేతిక విద్యాశాఖలోనే కొనసాగించాలి

**సిద్ధిపేట ఉమేన్స్ పాలిటెక్నీక్ కళాశాల విద్యార్థుల నిరసన**

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళు కావస్తున్నా నేటికీ విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిలేక విద్యార్థుల సమస్యలు పట్టించుకునేనాథుడే లేకుండాపోయిందని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను సాంకేతిక విద్యాశాఖ నుండి ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నాడని,సాంకేతిక విద్యా శాఖ లోనే కొనసాగించాలని సిద్దిపేట లో ఉమేన్స్ పాలిటెక్నీక్ కళాశాల విద్యార్థులు ధర్నా కు బిఆర్ఎస్ విద్యార్తి విభాగం నాయకులు మద్దతు పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.

రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు ఏడు దశాబ్దాల సుదీర్ఘ ఘన చరిత్ర ఉందని, ఎందరో నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యనభ్యసించి దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు.

రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 95% మంది నిరుపేద విద్యార్థులు నామమాత్రపు కళాశాల ఫీజు కట్టి నాణ్యమైన ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ స్థాయి విద్యను డిప్లొమా స్థాయిలోనే నేర్చుకుంటున్నారని ఇలాంటి పటిష్టమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యాచట్టం పరిధి నుండి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ పబ్లిక్- ప్రైవేట్ పార్ట్నర్షిప్ చట్టం పరిధిలో చేర్చడం వలన నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ చదువులకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటాయని తద్వారా పాలిటెక్నిక్ వ్యవస్థ పతనమవుతుందని ఆవేదన వ్యక్తంచేసారు.

ప్రభుత్వం ఎలాంటి ముందస్తు అభిప్రాయ సేకరణలు చేపట్టకపోవడం, ఇప్పటికీ స్పష్టమైన విధివిధానాలు బహిర్గతం చేయకపోవడం వలన ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం తమ భవిష్యత్ గురించి అయోమయంలో ఆందోళనలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ నిర్వీర్యానికి దారితీసే జీవో 97 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర మంత్రిమండలి అమోదించిన శక్తి శాఖలోకి పాలిటెక్నిక్ల విలీనం నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ విషయంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థకు అండగా నిలబడి శక్తి శాఖలోకి పాలిటెక్నిక్ల విలీనం బిల్లు చట్టబద్ధం కాకుండా ఎఐసీటీఈ ప్రమాణాలతో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే ఎస్బీటీఈటీ బోర్డు పర్యవేక్షణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ యధాతతంగా కొనసాగేలా పోరాటంలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థకు బాసటగా బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం అండగా ఉంటుందని వారు తెలిపారు. యధాతంగా కొనసాగె వరుకు పోరాటం ఆగదని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కెమెరా కంటితో చరిత్రకు జీవం



జెండా ఆవిష్కరిస్తున్న దుర్గాప్రసాద్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 19:** ఫోటోగ్రఫీ వృత్తి మాత్రమే కాదని కాలాన్ని, చరిత్రను, జ్ఞాపకాలను పదిలపరిచే అద్భుతమైన కళ అని ఫోటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు బల్లెం దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గార్ల మండల కేంద్రంలో మండల ఫోటోగ్రఫీ అసోసియేషన్ కోశాధికారి రావూరి ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ మండే డాగురే ను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఫోటోగ్రఫీ జెండాను ఆవిష్కరించారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర ఫోటోగ్రాఫర్ల సేవలను గుర్తుచేసుకొని వారికి నివాళులర్పించారు.అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చోటుచేసుకునే ముఖ్యమైన సంఘటనలను కెమెరాలో బంధించి భవిష్యత్ తరాలకు అందిస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలు విలువైనవని పేర్కొన్నారు.ఎండ, వాన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో ఫోటోగ్రాఫర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఫోటోగ్రాఫర్లంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యదర్శి శ్రీరామ్ జిల్లా నాయకులు బెల్లం కిరణ్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి మండల నాయకులు మహేష్ జంజిరాల భాస్కర్ అనుగోజు నాగబాబు ఎజాస్ వీరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలి: ఎంపీడీవో మంగమ్మ

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 19:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్నినిర్వహించనున్నట్లు ఎంపీడీవో మంగమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారి జి. దేశీరాం నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని, ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. మండలానికి సంబంధించిన వివిధ అభివృద్ధి, పరిపాలనా అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలం లో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.



ఎంపీడీవో మంగమ్మ

## వైరా నియోజకవర్గంలో విస్తృత పర్యటనలు

**ప్రజలతో మమేకం.. బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యం**

**కారేపల్లి, ఆగస్టు 19 పెన్ పవర్:** దివంగత బీఆర్ఎస్ పార్టీ మాజీ వైరా ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ నాయక్ అడుగుజాడల్లో ఆయన తనయ బానోత్ మనీషా లక్ష్మి రాజకీయంగా ముందుకు సాగుతున్నారు. తండ్రి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వైరా నియోజకవర్గంలో తనదైన రాజకీయ ప్రస్థానానికి బాటలు వేసుకుంటున్నారు.మదన్ లాల్ నాయక్ గతంలో ప్రజలతో మమేకమై పనిచేసిన తీరును స్ఫూర్తిగా తీసుకున్న మనీషా లక్ష్మి ప్రస్తుతం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గ్రామాలకు వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకోవడం, వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు.

**ప్రజల కష్టసుఖాల్లో తోడుగా..**
రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండాలనే లక్ష్యంతో మనీషా లక్ష్మి గ్రామాల పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. పేదలు, మహిళలు, యువత, రైతులు, పార్టీ కార్యకర్తలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. కష్టకాలంలో అండగా ఉంటానంటూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.

## పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమం ముందస్తు ఏర్పాట్లు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమం ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె. హైమావతి దిశ నిర్దేశం చేశారు హుస్నాబాద్ నియోజకవర్గం జిల్లాలో 3 మండలాలోనీ గ్రామాల్లో త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించబోయే పల్లె పల్లె కు పొన్నమన్న, పల్లె పల్లెలో ప్రజాపాలన కార్యక్రమ ముందస్తు ఏర్పాట్లనుజిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా ఆయా శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.హుస్నాబాద్ నియోజకవర్గ 3 మండలాలు కోహెడ, అక్కన్న పేట, హుస్నాబాద్ మండలంలో పల్లె పల్లె కు పొన్నమన్న, పల్లె పల్లెలో ప్రజాపాలన ద్వారా రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామంలో ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం నుండి ప్రజలకు అందుతున్న పథకాలు మరియు గ్రామాల్లో సమస్యలు గూర్చి నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు.గ్రామపంచాయతిలో సభ ఏర్పాటు టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవోలు ఆదేశించారు.శాఖల అధికారులు గ్రామాల్లో సభలో తెలిపిన దరఖాస్తులను నోట్ చేసుకుని, ఏ స్థాయిలో పరిష్కరించవచ్చు ప్రతిదీ రికార్డు చేసుకుని, ఫైలింగ్ చేసుకోవాలని ఏంపిడిఓ లను ఆదేశించారు.


ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు వివరాలు, కొత్త రేషన్ కార్డులు సభ్యుల చేర్చిన వివరాలు, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ మరియు సన్నవడ్లకు బోనస్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సరఫరా లబ్ధిదారులు, రైతు భరోసా మరియు రైతు బీమా పథకాలు లబ్ధిదారులు, కళ్యాణ లక్ష్మీ శాదిముబారక్ చెక్కులు, వడ్డీలేని రుణాలు పంపిణీ, ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన వివరాలతో జాబితా తయారు చేసి గ్రామ సభలో పెట్టాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

గ్రామంలో శాఖల వారిగా శాంక్షన్ అయిన పనులు, పనుల పురోగతి గూర్చి శాఖల వారిగా సమీక్ష జరుపుతారు.

ప్రతి పనికి ఒక నిర్ణిత కాలం పెట్టీ, ఆ నిర్ణిత కాలవ్యవధిలో పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గ్రామంలో ప్రాధాన్యత అంశాలు డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ, సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్స్ ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుగా తేలుకోవాలని ఆదేశించారు.

హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి ఈ ప్రోగ్రామ్ గురించి ప్రతి గ్రామం మానిటర్ చేస్తూ, కార్యక్రమం విజయవంతం చెయ్యాలని ఆదేశించారు.

## కమలంలో భారీ పెరుగుతున్న ఆశవాహులు



**హైదరాబాద్, ఆగస్టు 19, పెన్ పవర్:** గతేడాది ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనూహ్య విజయాలు నమోదు చేసి అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లకు గట్టి ఝులక్ ఇచ్చిన భారతీయ జనతా పార్టీ.. రాబోయే ఎమ్మెల్సీ పోరుకు సిద్ధమవుతోంది. నల్గొండ--వరంగల్--ఖమ్మం, మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం పావులు కదుపుతోంది. అయితే ఎన్నికల వ్యూహాల కంటే ముందే పార్టీలో టికెట్ల లొల్లి, అంతర్గత కుమ్ములాటలు తెరపైకి రావడం కాషాయ శిబిరంలో కాకరేపుతోంది. గత ఏడాది కరీంనగర్--మెదక్--నిజామాబాద్--ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి చింతపండు అంజిరెడ్డి, అలాగే మెదక్--కరీంనగర్--ఆదిలాబాద్--నిజామాబాద్ ఉపాధ్యాయ స్థానం నుంచి ఎం. కొమరయ్య ఘన విజయం సాధించి పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్నినింపారు. అయితే, ఆ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నుంచే మొదలైన అంతర్గత అసంతృప్తి ఇప్పుడు తాజా ఎమ్మెల్సీ పోరులో మరింత తీవ్రరూపం దాలుస్తోంది. పార్టీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నసీనియర్లకు ప్రాధాన్యమివ్వాలా లేక ఇతర పార్టీల నుంచి వచ్చిన తాజా నేతలకు అవకాశం కల్పించాలా? స్థానిక నేతలకు ఇవ్వాలా లేక బయటి వ్యక్తులను రంగంలోకి దించాలా? అన్న రెండు ప్రధాన ప్రశ్నలునాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ స్థానం బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. దాదాపు ఆరు లక్షల మంది ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో అగ్రవర్ణాలు,పట్టణ విద్యావంతులే బీజేపీకి ప్రధాన బలం. ప్రస్తుతం ఇక్కడ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె సురభి వాణీదేవి 2021లో బీఆర్ఎస్ నుంచి గెలిచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ స్థానాన్ని గతంలోఅంటే 2015లో నాటి బీఆర్ఎస్ హవాలోనూ గెలుచుకున్న ప్రస్తుత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు.. ఆ తర్వాతి ఎన్నికల్లో వాణీదేవి చేతిలో స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ఈసారి ఇక్కడినుంచి పీవీ నరసింహారావు మనవడు, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ బరిలోకి దిగాలని భావిస్తున్నారు. అమెరికాలో పీజీ ఇంజనీరింగ్ చదివిన విద్యావంతుడిగా, పార్టీ సంస్థాగత బలోపేతానికిపనిచేసిన నాయకుడిగా ఆయన తన వాదనను బలంగా వినిపిస్తున్నారు. మరోవైపు పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, న్యాయవాది ఎస్. మల్లా రెడ్డి కూడా ఎప్పటినుంచో పార్టీని నమ్ముకున్న విధేయుడిగాతనకు అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. అయితే, సమీకరణాలు మారితే స్వయంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావే మళ్లీ బరిలోకి దిగే అవకాశాలున్నాయని లేదా అనూహ్యంగా మరొకరి పేరుతెరపైకి వచ్చినా ఆశ్చర్యం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నల్గొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలోనూ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. సీనియర్ నాయకులు ఎస్. ప్రకాశ్‌రెడ్డి, జి. మనోహర్ రెడ్డి, జి. ప్రేమేందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు టికెట్ రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావులతో కూడిన కమిటీ అభ్యర్థుల పేర్లను పరిశీలించి హైకమాండ్ ఆమోదానికి పంపనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయిస్తామని పార్టీ అధిష్టానం చెబుతున్నప్పటికీ, గ్రూపురాజకీయాలు, లాబీయింగ్ అధిపత్యం ప్రదర్శిస్తున్నాయి. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల ఎన్నికలకు ప్రతిసారీ ఓటర్ల నమోదు కొత్తగా జరగాల్సి ఉంటుంది. కనీసం మూడేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసినగ్రాడ్యుయేట్లను పెద్ద ఎత్తున ఓటర్లుగా నమోదు చేయించడమే తమ ప్రధాన వ్యూహమని పార్టీ భావిస్తోంది. విద్యార్థి ఉద్యమాలు తమ గెలుపుపై ప్రభావం చూపబోవని నాయకత్వం ధీమాగా ఉన్నప్పటికీ,అంతర్గత అసమ్మతిని చక్కదిద్ది, బలమైన కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యూహాలను అధిగమించి కాషాయ జెండాను ఎగరేయడం బీజేపీకి నిజమైన సవాలే.

## కాంగ్రెస్ ను కబళిస్తున్న 22 ఏ



**హైదరాబాద్, ఆగస్టు 19, పెన్ పవర్:**
తెలంగాణలో రిజిస్ట్రేషన్ల చట్టం-1908లోని సెక్షన్ 22-ఎ పేరిట జరుగుతున్న వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతోంది. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్, సీలింగ్ మిగులు భూముల

పరిరక్షణ పేరిట చేపట్టిన రెవెన్యూ రికార్డులను అప్ డేట్ ప్రక్రియలో క్షేత్రస్థాయి అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ఏకంగా లక్షలాది మంది సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రైవేటు ఆస్తులు నిషేధిత జాబితాలోకిచేరిపోయాయి. జీవితకాల కష్టార్జితంతో చట్టబద్ధమైన అనుమతులతో కొనుగోలు చేసుకున్న సొంత ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లపై రాత్రికి రాత్రే నిషేధిత ముద్ర పడటం సామాన్యుడి గుండెల్లోపిడుగుపాటులా మారింది. ఈ సంక్షోభం తీవ్రత ప్రధానంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోనే అత్యధికంగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 22-ఎ జాబితాలో చేరిన ఆస్తుల్లో దాదాపు 54 శాతానికి పైగాకేవలం మేడ్చల్-మల్కాజ్‌గిరి , రంగారెడ్డి , సంగారెడ్డి , హైదరాబాద్ కోర్ సిటీ జిల్లాల్లోనే ఉన్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, చందానగర్, ఉప్పల్ వంటి అత్యంతకీలకమైన నివాస ప్రాంతాల్లోని లక్షకు పైగా ప్రాపర్టీలు ఈ జాబితాలో చిక్కుకుపోయాయి. వీటి మార్కెట్ విలువ రూ. లక్ష కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ప్రాపర్టీలపై రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతోబ్యాంకులు రుణాలు, మార్ట్‌గేజ్‌లను ఆపివేయడం రియల్ ఎస్టేట్ మరియు బ్యాంకింగ్ రంగాల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. అత్యవసర వైద్య ఖర్చులు, పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్ల కోసం తమఆస్తులను అమ్ముకుందామనుకున్న వేలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద లబోదిబోమంటున్నారు. అధికారుల తప్పిదం వల్ల ప్రైవేటు ఆస్తులు ఈ జాబితాలోకి ఎక్కగా, ఇప్పుడు మళ్లీ ప్రజలేతమ ఆస్తులను 22-ఎ నుంచి తొలగించాలంటూ కలెక్టరేట్లు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి రావడం తీవ్ర అన్యాయం. తమ తప్పేమీ లేకుండా పౌరులే దరఖాస్తు చేసుకోవాలనడం,ప్రజాపాలన పేరిట ప్రజలను మరోసారి దళారీ వ్యవస్థల కోరల్లోకి నెట్టడమే అవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తీవ్ర వ్యతిరేకతను గమనించిన రెవెన్యూ మంత్రి అధికారుల తప్పిదాలకు క్షమాపణలు చెప్పి, హైలెవల్ కమిటీ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అయితే కేవలం సారీ చెప్పడంతోనో,మొక్కుబడి కమిటీలతోనో ఈ సమస్య పరిష్కారం కాదు. గతంలో హైకోర్టు ఆదేశాల ద్వారా నిషేధిత జాబితా నుంచి క్లియర్ అయిన భూములను కూడా రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేయకపోవడం అధికారులక్షమించరాని నేరం. ప్రజలు దరఖాస్తు చేసుకునే వరకు వేచిచూడకుండా, ప్రభుత్వమే యుద్ధప్రాతిపదికన సుమోటో’గా డిజిటల్ డేటాను ప్రక్షాళన చేసి అన్ని ప్రైవేట్ రిజిస్టర్డ్ లేఅవుట్లను వెంటనే విడుదలచేయాలి. ప్రజాస్వామ్యంలో భూమి, సొంతిల్లు అనేది ప్రతి పౌరుడి భావోద్వేగంతో ముడిపడిన అత్యంత సున్నితమైన అంశం. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్,ఇలాంటి సున్నితమైన ఆస్తి హక్కుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల నుంచి వచ్చే తిరుగుబాటు తీవ్రంగా ఉంటుంది. ఈ 22-ఎ సమస్యను కాలయాపన చేయకుండా తక్షణమే పూర్తిగాపరిష్కరించకపోతే, అది ప్రభుత్వంపై తీవ్ర ప్రజావ్యతిరేకతకు దారితీసి కాంగ్రెస్ పార్టీ పునాదులనే కదిలించే ప్రమాదం ఉంది.


## మహబూబాబాద్‌లో ఉద్రిక్తత.. విద్యార్థుల గొంతు పట్టుకున్న సీఐ రఘుపతి రెడ్డి !



**మహబూబాబాద్: పెన్ పవర్:** పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం దగ్గర పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో సీఐ రఘుపతి రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. సీఐ విద్యార్థుల గొంతు పట్టుకోవడంతో సీఐ తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహబూబా బాద్ జిల్లా కేసముద్రం పాలిటెక్నిక్ విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడి యత్నించారు. జీ.ఓ. నంబర్ 97 రద్దు చేయాలని విద్యార్థుల ఆందోళన చేశారు. కలెక్టరేట్‌లోకి పాలిటెక్నిక్ విద్యార్థులు చొచ్చుకెళ్లారు. విద్యార్థులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు విద్యార్థులను ఈడ్చి బయటకు పంపారు. మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రాంతంలో టెన్షన్ నెలకొంది. పోలీసులు కలెక్టరేట్ గేట్లు బంద్ చేసి భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ రావాలంటూ కలెక్టరేట్ గేటు దగ్గర విద్యార్థులు అందోళన కొనసాగించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెలుగు రాష్ట్రాల్లో కోటి ఓట్లు మిస్సింగ్



**హైదరాబాద్, ఆగస్టు 19, పెన్ పవర్:**
కేంద్ర ఎన్నికల సంఘం తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో చేపట్టిన సమగ్ర ప్రక్షాళన ప్రక్రియ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రెండు రాష్ట్రాల్లో కలిపి సాంకేతికంగా కోటి ఇరవై లక్షలకు పైగా ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతున్నాయి. జాబితా నుంచి తొలగింపునకు గురవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే అయినప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయకపోవడం, సైలెంట్‌గా ఉండటం వెనుక ఏం జరుగుతోంది? వాస్తవానికి ఈ గల్లంతు ప్రక్రియ అంతా అర్హులైన ఓటర్లను తొలగించడం కాదని, ఓటర్ల జాబితాను క్లీన్ క్రమంలో జరుగుతున్న సాంకేతిక ప్రక్రియ అని పార్టీలకు స్పష్టమైన అవగాహన ఉంది. ఉమ్మడి రాష్ట్ర విడిపోయాక , హైదరాబాద్ కేంద్రంగా స్థ స్థిరపడిన లక్షలాది మందికి ఏపీ, తెలంగాణ రెండింటిలోనూ ఓట్లు ఉన్నాయి. దీనికి తోడు మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, ఆధార్‌తో ఎపిక్ సీడింగ్ జరగడం వల్ల ఈ డూప్లికేట్ , ఇన్-యాక్టివ్ ఓట్లను ఈసీ వ్యవస్థ పసిగట్టి తొలగిస్తోంది. ఇది ఓటు హక్కును కాలరాయడం కాదని తెలిసే ప్రధాన పార్టీలు దీనిపై వీధిపోరాటాలకు దిగడం లేదు. అయితే, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని ఈసీ వద్ద తరచూ ఫిర్యాదులు చేస్తోంది. దీని వెనుక కాంగ్రెస్ పార్టీకి బలమైన రాజకీయ సమీకరణాలు ఉన్నాయి. గడిచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, పట్టణ ప్రాంతాల్లో ఉన్న బోగస్, డబుల్ ఓట్లు ఫలితాలను ప్రభావితం చేశాయని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ, ఇతర పట్టణాల్లోనూ క్రమబద్ధీకరణ జరిగితే క్లీన్ ఓటర్ లిస్ట్ వల్ల తమకే పొలిటికల్ అడ్వాంటేజ్ ఉంటుందని కాంగ్రెస్ లెక్కిస్తోంది. అందుకే ప్రతి బూత్ స్థాయిలో తమ బూత్ లెవల్ ఏజెంట్లను అలర్ట్ చేస్తూ, తొలగింపులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, వైసీపీ, టీడీపీ-జనసేన కూటమి సైలెంట్‌గా ఉండటానికి కారణం.. క్షేత్రస్థాయి రియాలిటీయే. ఆయా పార్టీల అంతర్గత సర్వేల ప్రకారం, తొలగింపునకు గురవుతున్న ఓట్లలో అత్యధికం నివాసాలు మారిన వారివి, లేదా డబుల్ ఓటింగ్‌కు అవకాశం ఉన్నవే. ఒకవేళ పొరపాటున నిజమైన ఓటరు పేరు తొలిగినా, వారిని మళ్లీ ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేయించి ఓటరుగా నమోదు చేయించవచ్చనే సాంకేతిక వెసులుబాటు ఈసీ కల్పిస్తోంది. రచ్చ చేయడం కంటే క్షేత్రస్థాయిలో బిఎల్ఓ ల వద్ద తమ ఏజెంట్ల ద్వారా ఓట్ల పునరుద్ధరణ చేయించుకోవడమే ఉత్తమ మార్గమని పార్టీల భావన. వాస్తవానికి ఎన్నికల సంఘం పారదర్శకంగా ఫారమ్-7 దరఖాస్తులు, క్లెయిమ్స్ , అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను నిర్వహిస్తుండటంతో చట్టపరంగా దీన్ని ప్రశ్నించే అవకాశం తక్కువగా ఉంది. కోటి ఇరవై లక్షల ఓట్ల ప్రక్షాళన అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే క్రమంలో జరుగుతున్న ఒక ప్రక్షాళన. నిరసనలు, ఆందోళనల కంటే నిశ్శబ్దంగా బూత్ స్థాయిలో తమ మద్దతుదారుల ఓట్లు జాబితాలో ఉండేలా చూసుకోవడమే రాజకీంగా ప్రయోజనకరమని భావించి పార్టీలు వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నాయి. తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం అధికారికంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 2.64 కోట్లకు పైగా మంది ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించగా, వీరి పేర్లను ముసాయిదా జాబితాలో చేర్చారు. క్షేత్రస్థాయిలో డోర్-టు-డోర్ వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ ముసాయిదా వివరాలను వెల్లడించారుమరోవైపు, ఎన్యుమరేషన్ సర్వే సమయంలో దాదాపు 73.39 లక్షల అంటే 21.7 శాతం ఎంట్రీలు అన్‌కలెక్టబుల్ కేటగిరీ కింద నమోదై ముసాయిదా జాబితా నుంచి తాత్కాలికంగా తొలగింపునకు గురయ్యాయి. వీటిలో శాశ్వతంగా నివాసాలు మారిన వారు , డబుల్ ఎంట్రీలు , మరణించిన వ్యక్తుల వివరాలు ఉన్నట్లు సీఈవో ప్రకటించారు. ముఖ్యంగా

గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఈ తరహా వలస , అన్‌ట్రేసబుల్ ఓటర్ల సంఖ్య భారీగా నమోదైంది. ఓటర్ల సంఖ్య , నివాస ప్రాంతాల మార్పుల ఆధారంగా ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ స్టేషన్ల సంఖ్య 36,353కి పెరిగింది. ఓటర్లు తమ నివాసాలకు సమీపంలో సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేలా, రద్దీని నివారించేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల పరిమితిని క్రమబద్ధీకరించారు. ముసాయిదా జాబితాలో పేర్లు లేని లేదా తప్పులు దొర్లిన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పిస్తూ అభ్యంతరాలు, చేర్పుల గడువును అధికారులు ప్రకటించారు. దీని ప్రకారం సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుంది. ఓటర్లు తమ స్థితిని సరిచూసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని, అనంతరం అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# కమలం... కొత్త వ్యూహం..



**హైదరాబాద్, ఆగస్టు 19 పెన్ పవర్:**
తెలంగాణలో 2028 ఎన్నికల్లో అధికారం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో బీజేపీ అధిష్టానం కీలక వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీ బలోపేతం, సంస్థాగత పునర్నిర్మాణం, నాయకత్వ సర్దుబాట్లుఇవన్నీ ఒకే దిశలో కదులుతున్నాయి. ఈ ప్రక్రియలో పది మందితో కమిటీ ఏర్పాటు, జాతీయ కార్యవర్గం నుంచి కొందరు నాయకులను తప్పించడం, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్ వంటివి ముఖ్యమైనఅంశాలుగా కొత్త వ్యూహంలో భాగంగా ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి పది మందితో కమిటీని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి నుంచి నాయకత్వవరకు ఉన్న లోపాలను గుర్తించి, నిర్దిష్ట చర్యలు చేపట్టే దిశగా ఈ కమిటీ పని చేస్తుంది. తెలంగాణలో బీజేపీ ఇంకా స్థిరమైన సామాజిక, ప్రాంతీయ బలాన్ని సాధించలేదన్న భావనతోనే ఈ కమిటీ పనిచేస్తుందిబండి సంజయ్, కె. లక్ష్మణ్, డీకే అరుణలను జాతీయ కార్యవర్గం నుంచి తప్పించడం కేవలం పరిపాలనా మార్పు కాదు. పార్టీ వర్గాల ప్రకారం ఇది తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించే వ్యూహంలోభాగం. జాతీయ స్థాయి బాధ్యతల నుంచి విముక్తి చేయడం ద్వారా వారిని రాష్ట్ర స్థాయి పనులపై పూర్తి శ్రద్ధ పెట్టే అవకాశం కల్పించింది. ఇది అంతర్గత సమతుల్యతను కాపాడుతూ, రాష్ట్ర కార్యాచరణను వేగవంతం చేసే ప్రయత్నంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నవంబర్ నుంచి తెలంగాణపై బీజేపీ పూర్తి దృష్టి పెట్టనుంది. ఈ సమయంలో రాష్ట్ర కమిటీలో బండి సంజయ్, ఈటల రాజేందర్‌లకు కీలకబాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ఇది అనుభవజ్ఞులైన నాయకులను ముందుకు తీసుకువచ్చి, సంస్థాగతంగా, రాజకీయంగా బలమైన బృందాన్ని తయారు చేస్తుంది. 2023 ఎన్నికలఅనుభవాలను పరిగణనలోకి తీసుకుని, మరింత సమన్వయంతో కార్యాచరణ సాగించాలన్న ప్రణాళికతో ముందుకెళ్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర, బీజేపీ మూడో స్థానంలో ఉంది. 2028 ఎన్నికల నాటికి త్రిముఖ పోరులు బిజెపిని ముందు నిలిపేలా అధిష్టానం వ్యూహాత్మకంగా పావులు కలుగుతుంది. బీజేపీకి ఇంకా విస్తృత సామాజిక బేస్, స్థిరమైన నాయకత్వం, స్థానిక సమస్యలపైస్పష్టమైన ప్రత్యామ్నాయం అవసరం. 10 మెన్ కమిటీ, నాయకత్వ సర్దుబాట్లు, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్.. ఇవన్నీ దీర్ఘకాలిక

ప్రణాళికలో భాగంగా కనిపిస్తున్నాయి. 2028 లక్ష్యం చాలా దూరంగాఉన్నప్పటికీ, ఇప్పటి నుంచే సంస్థాగత పునాదులు వేయాలనేది అధిష్టానం ఆలోచన. బీజేపీ తెలంగాణలో కేవలం ప్రతిపక్ష పాత్రకే పరిమితం కాకుండా, అధికార పార్టీగా మార్చాలని స్పష్టమైన లక్ష్యంతోఅధినాయకత్వం చర్యలు చేపట్టింది. ఎందుకు అవసరమైన వ్యూహాలతో ముందుకు కదులుతోంది. ఈ వ్యూహాలు ఎంతవరకు విజయవంతమవుతాయో రాబోయే రోజుల్లో స్పష్టత వస్తుంది.

# పెట్టుబడుల వేటలో నెంబర్ 2 గా ఏపీ

**విజయవాడ, ఆగస్టు 19, పెన్ పవర్:**
ఏపీలో కూటమి ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. దేశంలోకి వస్తున్న కొత్త పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో గణనీయంగా తన పనితీరు మెరుగుపరుచుకుంది. ప్రముఖ జాతీయ బిజినెస్ పత్రిక బిజినెస్ స్టాండర్డ్స్ ప్రాజెక్టు టుడే నివేదికల ఆధారంగా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల వ్యవధిలో పెట్టుబడుల ర్యాంకింగ్స్లో తొమ్మిదో స్థానం నుంచి.. ఏడు స్థానాలకు ఎగబాకి ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఇది నిజంగా గొప్ప విషయం. గడిచిన రెండేళ్లలో ఈ పురోగతి సాధించడం గొప్ప పరిణామం. కూటమి ప్రభుత్వానికి ఇది ఊతం ఇచ్చే విషయం.వైసిపి 2024 వరకు అధికారంలో ఉంది. ఆ ఏడాది ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. అంటే 2024 ఏప్రిల్ నాటికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది వ స్థానంలో నిలిచింది. ఆ తదుపరి ఏడాది ఆర్థిక సంవత్సరంలో క్రమేపి పనితీరు మెరుత్కు పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో నిలవడం విశేషం. పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ పాలసీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే ఈ గణనీయమైన పురోగతి సాధ్యమైంది.పారిశ్రామిక పెట్టుబడులను సాధించడంలో మహారాష్ట్ర ముందంజలో కొనసాగుతోంది. ఇప్పుడు దాని తర్వాత స్థానం ఏపీ దక్కించుకోవడం విశేషం. ఇతర అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తట్టుకొని ఈ స్థానంలో నిలబడడం అనేది గొప్ప విషయం. రాజస్థాన్ మూడో స్థానంలో ఉండగా.. గుజరాత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఒడిస్సా 5వ స్థానంలో ఉండడం గమనించదగ్గ విషయం. అయితే పారిశ్రామికంగా ఎంతో ముందు వరుసలో ఉండే పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కంటే ఏపీ చాలా వేగంగా పెట్టుబడులను ఆకర్షించిందని అర్థం అవుతోంది.అయితే పెట్టుబడులను ఆకర్షించడంలో మాత్రం ఏపీ సీఎం చంద్రబాబు,
మంత్రి నారా లోకేష్ పాత్ర ఉంది. ఒకవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే.. పెట్టుబడులను ఆకర్షించడం కోసం వీరు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. తరచూ విదేశీ పర్యటనలు, అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు వెళ్లడం.. ఇలా చాలా రకాల ప్రయత్నాలు ఫలితమే పారిశ్రామిక పెట్టుబడుల సాధనలో రెండో స్థానం. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్,, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సిస్టం సమర్థవంతంగా పనిచేయడం వల్లే అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. తొమ్మిదవ స్థానంలో ఉన్న ఏపీని రెండో స్థానంలో నిలపడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ కనిపిస్తోంది. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది..

# బయటకొస్తున్న గ్రూప్ వన్ చిట్టా...



**కడప, ఆగస్టు 19, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో నిరుద్యోగ నియామకాల అంశం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, వైఎస్ఆర్సీపీ దీనిని ప్రధాన అస్త్రంగా చేసుకుని నిరసనలకు దిగుతోంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాల మూల్యాంకన అక్రమాలపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు సమర్పించిన నివేదికలో షాకింగ్ నిజాలు బయటపడటంతో వైఎస్ఆర్సీపీ ఇబ్బందుల్లో పడుతోంది. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తీవ్రమైన ఉల్లంఘనలు, సీసీటీవీల తొలగింపు, నియమావళికి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులతో వ్యాల్యుయేషన్ చేయించడం, రావీ= స్లిప్పుల రీ-ప్రింటింగ్ వంటి అక్రమాలు జరిగినట్లు సిట్ విచారణలో ఆధారాలు లభించాయి. ఒక్క నిర్ణయం వెనుక నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, నిర్దిష్ట అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు వ్యవస్థీకృత ప్రణాళిక నడిచిందని ఫోరెన్సిక్ ఆధారాలు చెబుతున్నాయి.సాధారణంగా నంబర్-1 స్థాయి రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో ఏజెన్సీలు నిబంధనలు ఉల్లంఘించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు లేదా బోర్డు సభ్యుల పాత్రపై దృష్టి సారిస్తాయి. గ్రూప్-1 వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి మరియు సంబంధిత ఉన్నతాధికారుల నిర్ణయాలపై ఇప్పటికే విచారణ సాగింది. అయితే, ఎలాంటి పొలిటికల్ గ్రీన్ సిగ్నల్ లేకుండా అంత పెద్ద వ్యవస్థాత్మక మార్పులు, ఓఎంఆర్ షీట్ల ప్రైవేటీకరణ లాంటి చర్యలు జరగడం అసాధ్యమనే వాదన బలంగా ఉంది.కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని కేవలం ఒక విభాగానికి సంబంధించిన రిక్రూట్‌మెంట్ లోపంగా చూడటం లేదు. వైఎస్ఆర్సీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం , నాటి ముఖ్య నాయకుల సూచనలతోనే ఈ నియామకాల నిబంధనల్లో మార్పులు చేశారన్న కోణంలో సాక్ష్యాధారాలు సేకరిస్తే, విచారణ రాజకీయ నేతల దాకా వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. గతంలో సిఐడి దర్యాప్తులో ఐఏఎస్ అధికారులను ప్రశ్నించినప్పుడు కొందరు ఉన్నతాధికారులు ఉన్నత స్థాయి ఒత్తిళ్ల వల్లే నిబంధనలు మార్చామని పరోక్షంగా చెప్పడం ఐఏఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ప్రస్తుత డీఎస్సీపై పోరాటం చేయడం ద్వారా నిరుద్యోగుల మద్దతు కూడగట్టాలని చూస్తున్న వైఎస్ఆర్సీపీ గ్రూప్-1 దర్యాప్తు ఒక పెద్ద అడ్డంకిగా మారింది. మా హయాంలో సుదర్శన చక్రంలా పారదర్శకంగా మార్చాం అని చెప్పుకుంటున్నా, హైకోర్టు ఆదేశాలు , సిట్ నివేదిక వైఎస్ఆర్సీపీ వాదనను బలహీనపరుస్తున్నాయి. ఈ కేసు తీవ్రతరం అయితే, ప్రతిపక్ష నాయకులు రాజకీయంగా మరింత రక్షణలోకి వెళ్లాల్సి వస్తుందిఈ నివేదిక ఆధారంగా కోర్టు ఇచ్చే ఆదేశాలు అత్యంత కీలకం కానున్నాయి. కేవలం అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మాత్రమే కాకుండా నాటి విధాన నిర్ణేతలు, ప్రభుత్వ సలహాదారులు కూడా విచారణ ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇది వైఎస్ఆర్సీపీలోని అగ్రనాయకత్వానికి ఊహించని రాజకీయ ప్రతిబంధకంగా మారనుంది. ఏపీలో రాజకీయం ఇప్పుడు రిక్రూట్‌మెంట్లు, స్కామ్‌ల చుట్టూ తిరుగుతోంది. గ్రూప్-1 అక్రమాల బాధ్యతను అధికారులపై మాత్రమే నెట్టివేసి ముగిస్తారా లేక సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుందా అన్నది రాబోయే రోజుల్లో సిట్ ఇచ్చే తుది ఛార్జ్‌షీట్‌తో తేలనుంది.

# క్షేత్రస్థాయి కేడర్ పై జగన్ గురి



**విజయవాడ, నెల్లూరు, ఆగస్టు 19, పెన్ పవర్:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జగన్‌కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్‌కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది.ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్‌కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూలు ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యక్రమాలతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం.ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

**మండలిలో..**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని పదేపదే విసిరిన సవాల్‌కు వైఎస్సార్సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్‌ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్‌కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది. అప్పటివరకు అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం నిరాటంకంగా ప్రతిపక్ష వైఫల్యాలను, గత ఐదేళ్ల పాలనా లోపాలను ఎండగడుతూనే ఉంటుంది. శాసనసభ రికార్డుల్లో నమోదయ్యే అధికారిక చర్చలకు ఉండే రాజ్యాంగబద్ధమైన విలువ, మీడియా పాయింట్ల వద్ద లేదా పార్టీ కార్యాలయాల్లో పెట్టే ప్రెస్ మీట్లకు ఎప్పటికీ ఉండదనే ప్రాథమిక పార్లమెంటరీ సూత్రాన్ని వైఎస్సార్సీపీ విస్మరించడం చర్చనీయాంశంగా మారింది.ప్రజాస్వామ్యంలో అధికార పక్షం తప్పులను ఎత్తిచూపేందుకు దక్కిన సంఖ్యాబలాన్ని సద్వినియోగం చేసుకోకుండా, కేవలం మైకు ఇవ్వలేదనో లేక ప్రతిపక్ష హోదా రాలేదనో సాకులు చెబుతూ సభా వేదికల నుంచి పారిపోవడం ప్రజల్లో మరింత చులకన భావాన్ని పెంచుతుంది. ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా పోస్టులతో కేవలం తమ సొంత కేడర్‌ను మాత్రమే సంతృప్తిపరచగలరు తప్ప, శాసనసభ వేదికగా ప్రజలకు జవాబుదారీతనాన్ని చాటుకోలేరు. ఈ పార్లమెంటరీ వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకోకపోతే ప్రతిపక్షంగా వైఎస్సార్సీపీ రాజకీయ మనుగడ మరింత క్లిష్టతరంగా మారే ప్రమాదం ఉంది

## జోగి రమేష్ ఎపిసోడ్

## బతుకు జట్కాబండి సీరియల్

**విజయవాడ, ఆగస్టు 19, పెన్ పవర్:**
రాజకీయాల్లో మైకుల ముందు నిలబడి ప్రత్యర్థులపై ఊగిపోతూ బూతులు అందుకోవడంలో స్పెషలిస్టులు అయిన జోగి ఫ్యామిలీ కుటుంబసభ్యులు ఇప్పుడు సొంత ఇంటి పంచాయతీలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంట్లో జరుగుతున్న తాజా పరిణామాలు ఇప్పుడు సరిగ్గా ఏదో టీవీ ఛానల్ బతుకు జట్కా బండి పంచాయితీని తలపిస్తున్నాయి. కొడుకు వైవాహిక జీవితం, కోడలితో వివాదాలు, కుటుంబ సమస్యలు మీడియాకెక్కడంతో.. ఆ కుటుంబం బయటకు వచ్చి తలెత్తుకోవడం కష్టంగా మారుతోంది.కుమారుడి ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత బలహీనతలు, కోడలు మేఘన చేసిన ఆరోపణలు ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చి బహిరంగ చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి అత్యంత సున్నితమైన వ్యక్తిగత సంక్షోభం ఎదురైనప్పుడు.. పరువు ప్రతిష్టలు ఉన్న కుటుంబాలు బాధితులతో చడీచప్పుడు కాకుండా సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని గుట్టుగా వ్యవహారాన్ని సర్దుబాటు చేసుకోవడం సహజం. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అయింది. నష్టనివారణ చర్యలు చేపట్టాల్సింది పోయి, ఆస్తిపాస్తులు, నగదు లావాదేవీలు, ఎదురు ఆరోపణల పేరిట రచ్చను మరింత పెద్దది చేసుకుంటూ కూర్చోవడం చూస్తుంటే కాలికి బురద అంటితే కడుక్కోవాల్సింది పోయి మొహం నిండా రాసుకున్నట్టు ఉందనే కామెంట్లు సోషల్ మీడియాలో పేలుతున్నాయి.డాది కిందట జోగి రమేష్ తన కుమారుడు రాజీవ్ కు సూర్యాపేటకు చెందిన మేఘనతో వివాహం చేయించారు. అయితే ఏడాది పాటు తనను కుటుంబ సభ్యులు ఇబ్బంది పెట్టారని మేఘన ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. పోలీసులు గృహహింస కింద కేసు నమోదు చేశారు. అయితే ఇటీవల ఇరు కుటుంబాలు కొంతమంది పెద్దలతో కలిసి సమావేశమైనట్లు తెలుస్తోంది. అయితే జోగి రాజీవ్ తన తల్లిదండ్రులను తప్పుపడుతూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. తరుణ్ వైట్ వాష్ చేసి పెళ్లికి ఒప్పించారని ఆయన చెబుతుండగా.. మరోవైపు మేఘన తనకు ఏడాది పాటు నరకం చూపించారని.. చంపేందుకు ప్రయత్నించారంటూ ఆరోపించారు. అయితే ఇరు కుటుంబాల వారు చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఎవరు తీసారో తెలియదు కానీ ఈ వీడియోలు మీడియాకు అందాయి. దీంతో సోషల్ మీడియా కూడా కూస్తుండగా.. ప్రధాన మీడియాలో సైతం కథనాలు వస్తున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా పని చేశారు జోగి రమేష్. రాజకీయంగా చాలా దూకుడుగా ఉండేవారు. ప్రత్యర్థులపై వ్యక్తిగతంగా విమర్శలు చేసేవారు. ఇప్పుడు ఆయన కుటుంబ వ్యవహారం బయటకు రావడంతో పెద్ద ట్రోలింగ్ అవుతోంది సోషల్ మీడియాలో.. అయితే కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసిన సమయంలో ఇదంతా రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్. అయితే ఇప్పుడు నేరుగా వారి మధ్య జరిగిన పంచాయితీ బయటకు రావడం.. అటు కుమారుడు సైతం తిరగబడటం... కోడలు తరుపు కుటుంబ సభ్యులు సైతం కార్నర్ చేస్తుండడంతో జోగి రమేష్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అయితే గతంలో ఆయనతో పాటు కుమారుడు చేసిన వ్యాఖ్యలను జోడిస్తూ.. కర్మ రిటర్న్ అంటూ ఎక్కువ మంది వ్యాఖ్యానిస్తున్నారు.ఒకప్పుడు నియోజకవర్గంలో చక్రం తిప్పి, ప్రత్యర్థుల ఇళ్లపైకి దండయాత్రలు చేసిన డాంబికాలు ఇప్పుడు సొంత ఇంటి సమస్యను పరిష్కరించుకోలేని నిస్సహాయత ముందు తేలిపోయాయి. కోడలి కుటుంబం చేస్తున్న ఆరోపణలు, పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కడం, ప్రెస్ మీట్లలో పరస్పర నిందారోపణలు చేసుకోవడం వల్ల జోగి కుటుంబ పరువు బజారున పడటం తప్ప పైసా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారం ఉన్నప్పుడు చూపిన తెగింపు, రాజీకొచ్చే విషయంలో వివేకంగా మారకపోవడమే ఈ వ్యవహారాన్ని మరింత నవ్వులపాలు చేస్తోందిరాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే విమర్శల కంటే.. సొంత చేజేతులా రోడ్డున పడేసుకున్న పరువు వల్ల వెనుక నవ్వుకునే నవ్వులే ఎక్కువ చేటు తెస్తాయి. పోవాల్సిన పరువు ఇప్పటికే పోయింది, మిగిలిన కాస్త ఇజ్జత్ అయినా కాపాడుకోకపోతే ఈ'ఫ్యామిలీ డ్రామా ఎపిసోడ్లు మరింత నాని ప్రజల్లో జోగి ఫ్యామిలీని ఒక కమెడియన్ గ్రూప్‌గా మిగిల్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మీడియా కెమెరాల ముందు డ్రామాలు ఆపి, నలుగురిలో నవ్వులపాలు కాకుండా చాపకింద నీరులా ఈ వివాదానికి తెరదించకపోతే... జోగి వెనుక సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటూ నవ్వుకోవడం ఖాయం.

## భోగాపురంలో బాదుడే...బాదుడు



**విజయనగరం, ఆగస్టు 19, పెన్ పవర్:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యాయి. నిన్నటి నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభం కాగా.. తొలిరోజు 26 విమాన సర్వీసులు నడిచాయి. అయితే తొలి రోజు ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. విశాఖ నగరం నుంచి 20 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. మరోవైపు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ ప్రతి రెండు గంటలకు ఒకసారి బస్సులు నడిచినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. పైగా భోగాపురంలో ఆర్టీసీ బస్సులను ఆపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయలేదు. ఇంకోవైపు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో చార్జీల బాదుడు అధికంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కమర్షియల్ వెహికల్ ఎంట్రీ, వెయిటింగ్ పేరుతో భారీగా చార్జీలు వసూలు చేస్తుండడం వివాదాలకు దారితీస్తోంది. ఒక డ్రైవర్ విమానాశ్రయం సిబ్బందిని నిలదీస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులను తీసుకొచ్చాడు ఓ క్యాబ్ డ్రైవర్. అయితే ఆ డ్రైవర్ నుంచి సిబ్బంది ఏకంగా 600 రూపాయల కమర్షియల్ టాక్స్, వెయిటింగ్ ఛార్జ్ డిమాండ్ చేయడంతో డ్రైవర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రయాణికులను విమానాశ్రయంలో దించేందుకు 700 రూపాయలు తీసుకున్నానని.. కానీ విమానాశ్రయం లోపలికి ప్రవేశించగానే 600 రూపాయలు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించాడు. ఇది ఎంత మాత్రం న్యాయం కాదని.. నిబంధనల పేరుతో క్యాబ్ డ్రైవర్లను నిలువునా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో విపరీతంగా ట్రోల్ అవుతోంది.వాస్తవానికి విమానాశ్రయం డిస్ప్లే బోర్డు పై పొందుపరిచిన పార్కింగ్, వెయిటింగ్ ఫీజుల ను మాత్రమే తీసుకోవాలి. అయితే ఈ డిస్ప్లేలో సైతం భారీగా చార్జీలు కనిపిస్తున్నాయి. అయితే తాము చెప్పినట్టుగా 600 రూపాయలు ఇవ్వాల్సిందేనని ఎయిర్పోర్ట్ సిబ్బంది డిమాండ్ చేయగా.. సదరు డ్రైవర్ మాత్రం ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనకు న్యాయం జరిగే వరకు కారును ఇక్కడి నుంచి కదిలించేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. ఉన్నతాధికారుల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలో చెప్పాలంటూ పట్టుపట్టాడు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గట్టి వాదన జరిగింది. పక్కనున్న వారు ఈ వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో విపరీతంగా వైరల్ అయింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# కోమటిరెడ్డి సరితకు ట్రంప్ మద్దతు.. అమెరికాలో ఇదో సంచలనం



అమెరికా రాజకీయాల్లో తెలుగు మూలాలున్న మరో మహిళ కీలక పదవి కోసం పోటీ పడుతున్నారు. న్యూయార్క్ రాష్ట్ర అటార్నీ జనరల్ పదవికి రిపబ్లికన్ అభ్యర్థిగా బరిలో ఉన్న సరిత కోమటిరెడ్డికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా మద్దతు ప్రకటించారు. ప్రస్తుత అటార్నీ జనరల్, డెమోక్రటిక్ పార్టీకి చెందిన లెటిటియా జేమ్స్‌ను ఓడించేందుకు సరితకు మద్దతుగా నిలవాలని ట్రంప్ తన అనుచరులకు పిలుపునిచ్చారు. నవంబర్‌లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ మద్దతు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రంప్, లెటిటియా జేమ్స్ మధ్య గత కొంతకాలంగా రాజకీయ, న్యాయపరమైన విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జేమ్స్‌పై తీవ్ర విమర్శలు చేసిన ట్రంప్.. ఆమె స్థానంలో సరిత కోమటిరెడ్డిని గెలిపించాలని కోరారు. జేమ్స్ న్యూయార్క్ అటార్నీ జనరల్‌గా రెండుసార్లు పనిచేస్తున్నారు. 2026 ఎన్నికల్లో ఆమెకు ప్రత్యర్థిగా సరిత బరిలో ఉన్నారు. న్యూయార్క్ స్టేట్ ఎన్నికల అధికారిక అభ్యర్థుల జాబితాలో కూడా జేమ్స్, సరిత పేర్లు అటార్నీ జనరల్ పదవికి నమోదయ్యాయి.

**తెలంగాణ మూలాలున్న సరిత**

సరిత కోమటిరెడ్డికి తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌కు చెందినవారు. 1980లలో వారు అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. సరిత అమెరికాలోని బ్రూక్లిన్‌లో జన్మించారు. అనంతరం ఆమె కుటుంబం మిస్సోరీకి వెళ్లింది. ప్రస్తుతం 41 ఏళ్ల సరితకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఆమె హార్వర్డ్ కాలేజ్, హార్వర్డ్ లా స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. న్యాయవృత్తిలో సరితకు విశేష అనుభవం ఉంది. అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్‌గా 12 సంవత్సరాలకు పైగా పనిచేశారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, మనీలాండరింగ్, మోసం, అంతర్జాతీయ నేరాలకు సంబంధించిన కేసులను ఆమె వాదించారు. అల్‌ఖైదా, ఐసిస్, మెక్సికన్ డ్రగ్ కార్టెల్స్‌కు సంబంధించిన కేసుల్లోనూ ఆమె కీలకంగా వ్యవహరించారు. అమెరికా న్యాయశాఖ నుంచి పలు అవార్డులు కూడా అందుకున్నారు. ఫెడరల్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన తర్వాత సరిత డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు అప్పటి ఫెడరల్ అప్పీల్ కోర్టు న్యాయమూర్తి బ్రెట్ కావనాగ్ వద్ద లా క్లర్క్‌గా పనిచేశారు. 2020లో ట్రంప్ ఆమెను ఫెడరల్ న్యాయమూర్తి పదవికి నామినేట్ చేశారు. ప్రస్తుతం హోల్జ్‌మన్ వొగెల్ న్యాయ సంస్థలో భాగస్వామిగా పనిచేస్తూ, కొలంబియా లా స్కూల్‌లో బోధిస్తున్నారు.

**భద్రతే ప్రధాన అజెండా**

అటార్నీ జనరల్ పదవికి పోటీ చేస్తున్న సరిత తన ప్రచారంలో ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, ప్రభుత్వ అవినీతి నిర్మూలన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. న్యూయార్క్ ప్రజలు సురక్షితంగా జీవించేందుకు కఠినమైన చట్ట అమలు అవసరమని ఆమె చెబుతున్నారు. "న్యూయార్క్ సురక్షితంగా లేకపోతే మరేదీ ముఖ్యం కాదు" అనే నినాదంతో ఆమె ప్రచారం సాగుతోంది.ట్రంప్ మద్దతు లభించడంపై సరిత కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు తనపై నమ్మకం ఉంచి మద్దతు ప్రకటించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ట్రంప్‌తో తనకు ఉన్న రాజకీయ అనుబంధం, గతంలో ఆయన నుంచి లభించిన న్యాయపరమైన పదవి నామినేషన్ నేపథ్యంలో ఈ మద్దతు ప్రాధాన్యతను సంతరించుకుంది.
అయితే న్యూయార్క్‌లో రిపబ్లికన్ అభ్యర్థికి రాష్ట్రవ్యాప్త ఎన్నికలో విజయం సాధించడం అంత సులభం కాదు. ఈ నేపథ్యంలో ట్రంప్ బహిరంగ మద్దతు సరిత ప్రచారానికి ఎంతవరకు ఉపయోగపడుతుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు లెటిటియా జేమ్స్ తన రాజకీయ అనుభవంతో బరిలో ఉన్నారు. దీంతో నవంబర్ ఎన్నిక న్యూయార్క్ రాజకీయాల్లో కీలక పోరుగా మారింది.తెలుగు మూలాలున్న సరిత కోమటిరెడ్డి న్యూయార్క్ అటార్నీ జనరల్‌గా గెలిస్తే.. రాష్ట్రస్థాయిలో ఇంత కీలకమైన పదవిని చేపట్టిన భారతీయ, ముఖ్యంగా తెలుగు సంతతికి చెందిన మహిళగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు లభించనుంది. ట్రంప్ మద్దతుతో ఆమె ప్రచారానికి కొత్త ఊపు వచ్చిన నేపథ్యంలో నవంబర్ ఫలితాలపై అమెరికాతో పాటు తెలంగాణలోనూ ఆసక్తి నెలకొంది.

# పోలాండ్‌లో తెలుగు యువకుడి మృతి.. పుట్టిన బిడ్డను చూడకుండానే కన్నుమూత



కూలిపని చేస్తే తప్ప రోజూ గడవని పరిస్థితి. కళ్లల్లో వెయ్యి ఆశలు, గుండెల్లో భవిష్యత్తుపై కొండంత నమ్మకం. కంటికి నలుసంత చిన్న పిల్లల భవిష్యత్తును దిద్ది తీర్చడానికి.. కనీసం ఒక సొంతిల్లు కట్టుకోవడానికైనా నాలుగు రాళ్లు వెనకేసుకోవాలన్న తాపత్రయం. సరిగ్గా ఇదే ఆశతో ఏడు సముద్రాలు దాటి యూరప్‌లో అడుగుపెట్టాడు ఆ తండ్రి. కానీ ఆశలన్నీ అడియాసలయ్యాయి. విధాత రాసిన క్రూరమైన విధిరాతకు ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది. పోలండ్‌లో ఉద్యోగం చేస్తూ కనీసం కొత్తగా పుట్టిన తన చిన్నారినైనా కళ్లారా చూడకుండానే ఒక తెలుగు యువకుడు గుండెపోటుతో అకాల మరణం చెందాడు.

**కన్నీటి సాగరంలో శ్రీకాకుళం గ్రామం**

శ్రీకాకుళం జిల్లా కపుగోడయావలస గ్రామానికి చెందిన బాత్సల రాంబాబు (37) జీవితంలో స్థిరపడాలనే ఆశయంతో గత ఏడాది డిసెంబర్‌లో పోలండ్ వెళ్లాడు. అక్కడ కష్టపడి పనిచేస్తూ స్వదేశంలోని తన కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. అంతా సవ్యంగా సాగుతోందనుకున్న సమయంలో సోమవారం రాత్రి ఒక్కసారిగా సంభవించిన గుండెపోటు అతని ప్రాణాలను బలిగొంది. రాంబాబు అకస్మాత్తుగా కన్నుమూశాడనే వార్త తెలియగానే అతని స్వగ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. భార్య లావణ్య, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

**పుట్టిన బిడ్డను చూడకుండానే సుదూర తీరాలకు...**

ఈ విషాద సంఘటనలో అత్యంత హృదయ విదారకమైన అంశం ఏంటంటే రాంబాబు పోలండ్ విమానం ఎక్కినప్పుడు ఆయన భార్య లావణ్య గర్భవతి. సుదూర తీరాల్లో ఉంటూనే తన కుటుంబ క్షేమాన్ని నిరంతరం విచారించేవాడు. ఆయన విదేశాల్లో ఉన్న సమయంలోనే భార్య ఒక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాపకు 'చరిష్మా' అని పేరు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఆ చిన్నారి వయస్సు కేవలం ఎనిమిది నెలలు. ఆరేళ్ల బిందుశ్రీ అనే మరో కుమార్తె కూడా ఉంది. "నా బిడ్డను ఎప్పుడు కళ్లారా చూస్తానో ఎప్పుడు గుండెలకు హత్తుకుంటానో" అని పరితపించిన ఆ తండ్రి ఆ చిన్నారిని ఒక్కసారి కూడా చూడకుండానే కన్నుమూయడం స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది. తండ్రి ప్రేమానురాగాలకు నోచుకోని ఆ చిన్నారుల అమాయకపు చూపులు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి.

**ప్రభుత్వ సాయం కోసం దిక్కులు చూస్తున్న కుటుంబం**

విదేశంలో సంపాదించి కుటుంబానికి వెలుగులు నింపుతాడనుకున్న ఇంటి యజమాని లేడన్న నిజం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. రాంబాబు భౌతికకాయాన్ని కడసారి చూపు కోసం సొంత ఊరికి తీసుకురావడానికి కుటుంబసభ్యులు, స్థానికులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక టిడిపి నాయకుడు శివప్రసాద్ ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. విదేశాంగ శాఖ ద్వారా తక్షణమే చర్యలు తీసుకుని, రాంబాబు మృతదేహాన్ని శ్రీకాకుళంలోని స్వగ్రామానికి రప్పించేలా చూడాలని.. ఆ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని గ్రామస్తులు కన్నీటితో విజ్ఞప్తి చేస్తున్నారు.

# పీవీ సింధు నుదుటిపై ఉన్న వింత డివైజ్ ఏంటి? మ్యాచ్‌లో ఎందుకు ధరించింది?





భారత స్టార్ షట్లర్, డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు మరోసారి తన ఆటతీరుతో అభిమానులను ఆకట్టుకుంది. 2026 బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన సింధు.. తన ఆటతో పాటు నుదుటిపై ధరించిన ఓ చిన్న పరికరంతోనూ అందరి దృష్టినీ ఆకర్షించింది. చూడటానికి చిన్న స్టిక్కర్‌లా కనిపించిన ఈ గాడ్జెట్ ఏంటి? మ్యాచ్ ఆడుతున్న సమయంలో సింధు దీన్ని ఎందుకు ధరించింది? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

**అసలు ఏంటీ టెంపుల్ డివైజ్?**

సింధు నుదుటిపై కనిపించిన పరికరం పేరు 'టెంపుల్'. ఇది ఏఐ ఆధారిత వేరబుల్ టెక్నాలజీతో అభివృద్ధి చేస్తున్న ప్రయోగాత్మక ఫిట్‌నెస్, బ్రెయిన్ ట్రాకింగ్ డివైజ్‌గా తెలుస్తోంది. క్రీడాకారులు తీవ్ర పోటీ పరిస్థితుల్లో ఉన్నప్పుడు వారి శారీరక, మానసిక ప్రతిస్పందనలను అర్థం చేసుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ పరికరం ద్వారా ఆటగాడి ఒత్తిడి, అలసట, ఏకాగ్రత, రికవరీ వంటి అంశాలకు సంబంధించిన డేటాను సేకరించి విశ్లేషించవచ్చు. మ్యాచ్‌లో కీలక సమయాల్లో ఆటగాడి శరీరం, మనసు ఎలా స్పందిస్తున్నాయో తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

**సింధు ఎందుకు ఉపయోగిస్తోంది?**

పీవీ సింధు ప్రస్తుతం ఈ టెక్నాలజీ ప్రయోగ పరీక్షల్లో భాగంగా ఉన్నట్లు సమాచారం. ఆమె మ్యాచ్‌లలో ఈ పరికరాన్ని ఉపయోగించడం ద్వారా సేకరించే డేటా.. శిక్షణ, ఫిట్‌నెస్, రికవరీ ప్రక్రియలను మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. సింధు భర్త వెంకట దత్త సాయి వెల్లడించిన వివరాల ప్రకారం.. సింధుకు సంబంధించిన వివిధ మెట్రిక్స్, డేటాను ట్రాక్ చేసేందుకు ఈ డివైజ్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఇది ప్రయోగ దశలోనే ఉన్నప్పటికీ ప్రాథమిక ఫలితాలు ఆశాజనకంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**ఎవరు అభివృద్ధి చేశారు?**

జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ నేతృత్వంలోని బృందం ఈ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్లు సమాచారం. సింధు వంటి ప్రొఫెషనల్ అథ్లెట్ల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ద్వారా పరికరాన్ని మరింత మెరుగుపరిచే ప్రయత్నం జరుగుతోంది.
ప్రస్తుతం 'టెంపుల్' సాధారణ వినియోగదారులకు మార్కెట్లో అందుబాటులో లేదు. మరిన్ని పరిశోధనలు, పరీక్షలు పూర్తయిన తర్వాత భవిష్యత్తులో వెల్‌నెస్ రంగంలోకి తీసుకురావచ్చని తెలుస్తోంది.

**క్రీడల్లో టెక్నాలజీకి కొత్త దారి**

ఒకప్పుడు క్రీడాకారుల ప్రదర్శనను స్కోర్లు, ఫిట్‌నెస్ టెస్టులు, వీడియో విశ్లేషణలతో మాత్రమే అంచనా వేసేవారు. ఇప్పుడు ఏఐ, వేరబుల్ టెక్నాలజీ, బయోమెట్రిక్ డేటా వంటి ఆధునిక పద్ధతులు క్రీడా శిక్షణలో కీలకంగా మారుతున్నాయి.
2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌పై దృష్టి పెట్టిన సింధు.. తన ఫిట్‌నెస్, ఆటతీరు, రికవరీని మరింత మెరుగుపరుచుకునేందుకు ఇలాంటి సాంకేతికతలను పరీక్షించడం ఆసక్తికరంగా మారింది. భవిష్యత్తులో ఇలాంటి పరికరాల నుంచి లభించే డేటా క్రీడాకారుల శిక్షణ, పనితీరు విశ్లేషణలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అందుకే సింధు నుదుటిపై కనిపించిన ఆ చిన్న పరికరం కేవలం ఓ స్టిక్కర్ కాదు.. క్రీడా ప్రపంచంలో టెక్నాలజీ ఏ స్థాయికి చేరుకుంటోందో చూపించే ఓ ప్రయోగాత్మక అడుగుగా చెప్పొచ్చు.

# ఎమ్మెల్యేలు అందరకీ కార్లు, నిర్వహణ కోసం రూ.75 వేలు : సీఎం విజయ్ సంచలన నిర్ణయం



తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రోజుకొక సంచలన నిర్ణయంతో పతాక శీర్షికల్లో నిలుస్తున్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష భేదం లేకుండా మొత్తం 234 మంది శాసనసభ్యులకు ప్రభుత్వ ఖర్చుతో కార్లు సమకూరుస్తామని ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా, ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఎమ్మెల్యేలకు వాహనాలు కేటాయిస్తామని ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేలకు కార్లు ఇవ్వడం ద్వారా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలు అవుతుందని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నిర్ణయాలు దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లో అనేక సంచలనాలకు తెర తీసిన సీఎం విజయ్ బుధవారం ఎవరూ ఊహించని ప్రకటన చేశారు. తమకు వ్యక్తిగత వాహనాలు లేకపోవడం వల్ల నియోజకవర్గాల్లో పర్యటించడం కష్టంగా ఉందని, ప్రజా సమస్యలు తెలుసుకోలేకపోతున్నామని మిత్రపక్షం వీసీకే ఎమ్మెల్యే జోతిమణి అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే తెలియజేసిన సమస్యపై స్పందించిన ముఖ్యమంత్రి విజయ్ వెనువెంటనే రాష్ట్రంలో 234 మంది ఎమ్మెల్యేలకు కొత్త కార్లు అందజేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా నెలవారీ ఇంధన ఖర్చులు, డ్రైవర్ జీతం కింద రూ.75 వేలు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కార్యాలయాల నిర్వహణకు రూ.25 వేలు చెల్లిస్తామని ప్రకటించారు.ఎమ్మెల్యేలకు అధికారిక వాహనాలు, నిర్వహణ కోసం నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి దళపతి విజయ్ చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. 80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఈ తరహా సౌకర్యం కల్పించలేదని చెబుతున్నారు. పార్లమెంటు సభ్యులకు కూడా ప్రభుత్వ వాహన సౌకర్యం లేదని అంటున్నారు. కానీ తొలిసారిగా తమిళనాడు సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు దిక్సూచిలా మారనుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎంపీలకు జీతం, ప్రయాణ భత్యం, మెడికల్ అలవెన్సులు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని, కానీ ఇప్పటివరకు వాహన సౌకర్యం మాత్రం లేదని అంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి దళపతి విజయ్ తీసుకున్న ఈ నిర్ణయంపై సానుకూలంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వం తరఫున బాధ్యతగా ఎమ్మెల్యేలు అందరికీ కార్లు కొనుగోలు చేస్తామన్న ప్రకటన ద్వారా అధికార కూటమిలోని 90 శాతం ఎమ్మెల్యేలకు మేలు చేస్తుందని అంటున్నారు. రెండేళ్ల క్రితం పార్టీ పెట్టి, అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత సామాన్యులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి గెలిపించిన ముఖ్యమంత్రి విజయ్, వారితో సమర్థంగా పనిచేయించుకునేందుకు ఈ నిర్ణయం ఉపకరిస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం అధికార కూటమిలో ఉన్న ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది అత్యంత సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన వారు కావడంతో వారికి వ్యక్తిగత వాహనాలు లేవని చెబుతున్నారు. దీంతో నియోజకవర్గాల్లో పర్యటనలు వారి శక్తికి మించిన భారంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ప్రభుత్వ డబ్బుతో వాహనాలు సమకూర్చడం వల్ల ఎమ్మెల్యేలు విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు.

# నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ దారుణ హత్య.. కేసును ఛేదించిన పోలీసులు, నిందితులు పదో తరగతి విద్యార్థులే..

కొండమల్లేపల్లి పట్టణంలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి (45) దారుణ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రిన్సిపల్‌ను హత్య చేసింది ఆమెకు విద్యార్థులుగా ఉన్న పదో తరగతి విద్యార్థులేనని పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం. డబ్బు కోసం పక్కా ప్రణాళికతోనే ఈ హత్యకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. కొండమల్లేపల్లి పట్టణంలోని జేబీ కాలనీలో నివాసం ఉంటున్న రూపారెడ్డి ఈ నెల 11వ తేదీన హత్యకు గురయ్యారు. ఘటన జరిగిన సమయంలో ఆమె భర్త హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. పాఠశాల విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్న ఆమెను నిందితులు అప్పటికే గమనించినట్లు పోలీసులు గుర్తించారు.

**గోడ దూకి ఇంట్లోకి ప్రవేశం**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. నిందితులు ముందుగానే రూపారెడ్డి ఇంటి వద్దకు చేరుకుని గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఆమె ఇంటి తాళం తీసుకుని లోపలికి వచ్చిన సమయంలో వంటగదిలో దాక్కున్నారు. రూపారెడ్డి ఫ్రెష్ అయి బెడ్‌రూమ్‌లోకి వెళ్లిన సమయంలో వెనుక నుంచి ఒక్కసారిగా దాడి చేశారు. కత్తితో ఆమెపై ఏకంగా 27 సార్లు దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.హత్య అనంతరం ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న నగదును నిందితులు తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత సుమారు రూ.2 లక్షలు దోచుకెళ్లినట్లు సమాచారం ఉండగా మొత్తం రూ.4 లక్షల వరకు నగదు అపహరించి ఉండొచ్చనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**గంజాయికి అలవాటు.. జల్సాల కోసం డబ్బు**

నిందితులు గంజాయికి అలవాటు పడటంతో పాటు విచ్చలవిడిగా ఖర్చులు, జల్సాలకు అలవాటు పడ్డారని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డబ్బు అవసరం కావడంతో ప్రిన్సిపల్‌ను టార్గెట్ చేసినట్లు సమాచారం. హత్య అనంతరం దొంగిలించిన డబ్బుతో హైదరాబాద్‌లో జల్సాలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు అనుమానం రాకుండా నిందితులు చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. సీసీ కెమెరాల్లో తమ కదలికలు కనిపించకుండా వ్యవహరించడంతో పాటు.. హత్య జరిగిన తర్వాత కూడా సాధారణంగానే



స్కూల్‌కు వచ్చి పరిణామాలను గమనించినట్లు తెలుస్తోంది.

**80 మందిని విచారించిన పోలీసులు**

కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు దాదాపు 80 మందిని విచారించినట్లు సమాచారం. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు చివరకు అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు. కొండమల్లేపల్లి మండలంలోని రెండు తండాలకు చెందిన ముగ్గురు విద్యార్థులపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలుస్తోంది. వారిలో ఇద్దరు నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులుగా గుర్తించినట్లు సమాచారం.
నిందితులను ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారిని విచారిస్తూ హత్యకు దారితీసిన పూర్తి కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. కేవలం నగదు కోసమే ఈ హత్య జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.ప్రిన్సిపల్‌ను ఆమె విద్యార్థులే హత్య చేశారన్న విషయం వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. దర్యాప్తు పూర్తయిన తర్వాత హత్యకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

## సంపాదకీయం

# జయహో బీసీ


ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో సామాజిక న్యాయం దిశగా మరోసారి చారిత్రాత్మక అడుగు పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం, స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్లను గణనీయంగా పెంచేందుకు ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో (ఆర్ఎల్బీలు) బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో (యూఎల్బీలు) 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది కేబినెట్ నిర్ణయం. ప్రస్తుతమున్న 24.15 శాతంనుంచి ఇది భారీ పెరుగుదల. ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తూ శాసనసభలో ముఖ్యమంత్రి నాయుడు మాట్లాడినప్పుడు, సభ మొత్తం "జయహో బీసీ" నినాదాలతో మార్మోగింది. 2024 ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన కీలక హామీలలో ఇదొకటి. దాన్నిప్పుడు వాస్తవరూపంలోకి తెచ్చిన కూటమి ప్రభుత్వాన్ని హర్షించక తప్పదు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పూ ఉండదని, అవి యథాతథంగా కొనసాగుతాయని కేబినెట్ స్పష్టం చేయడం, ఈ నిర్ణయం ఇతర సామాజిక వర్గాల హక్కులకు భంగం కలిగించకుండా, కేవలం బీసీలకు అదనపు ప్రాతినిధ్యం కల్పించే దిశగానే రూపొందించారన్నది స్పష్టం. దీంతోపాటు, పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్పర్సన్లను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. ఇది స్థానిక పరిపాలనలో ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత బలోపేతం చేసే చర్య అనడానికి ఏమాత్రం సందేహాలు అక్కర్లేదు.

బీసీల సాధికారత దిశగా చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం కొత్తది కాదు, ఇది దశాబ్దాల నాటి స్థిరమైన రాజకీయ నిబద్ధతకు కొనసాగింపు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే విధానాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు హయాంలోనేనని నాయుడు గుర్తు చేసుకున్నారు. అనంతరం తన సొంత పాలనా కాలంలో పంచాయతీరాజ్ చట్టం కింద ఈ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచినట్టు చెప్పుకొచ్చారు. బీసీలు రాష్ట్ర జనాభాలో 50.42 శాతం ఉన్నారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, గ్రామీణ మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సంప్రదాయ కళాకారుల రంగాలకు వారు అందిస్తున్న తోడ్పాటు అమూల్యమని నాయుడు కొనియాడారు. "బీసీలు వెనుకబడినవారు కాదు.. తగిన అవకాశాలు దక్కకపోవడం వల్లే వెనుకంజలో ఉండిపోయారు" అని నాయుడు స్పష్టం చేసిన తీరు.. ఇది కేవలం రాజకీయ ప్రకటన మాత్రమే కాదు, రిజర్వేషన్ల వెనుక ఉన్న సైద్ధాంతిక దృక్పథాన్ని ప్రతిబింబించేదే. బీసీ కమ్యూనిటీల సంప్రదాయ నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో మిళితంచేసి, వారిని అంతర్జాతీయ మార్కెట్లలో మరింత చురుగ్గా భాగస్వాములను చేయాలని, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలను నైపుణ్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వం లక్ష్యం. విద్య, నైపుణ్యం, ఉద్యోగం, వ్యవస్థాపకత, రాజకీయ ప్రాతినిధ్యం -ఈ ఐదు అంశాల్లో బీసీలకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ విస్తృత దార్శనికత! జీవన ప్రమాణాల మెరుగుదల, ఆర్థిక అసమానతల తగ్గింపు, సామాజిక పురోగతివంటి ప్రమాణాలతో అభివృద్ధిని కొలవాలన్న ప్రభుత్వ దృక్పథం, రిజర్వేషన్లను కేవలం రాజకీయ సాధనంగా కాకుండా, సమగ్ర సాధికారతా సాధనంగా చూస్తున్నట్టు స్పష్టం చేస్తోంది.

ఈ నిర్ణయం అమలుకు అవసరమైన పరిపాలనా సంస్కరణలను కూడా ప్రభుత్వం సమాంతరంగా చేపట్టడం గమనార్హం. రాష్ట్రంలో జిల్లా పరిషత్‌ల సంఖ్యను ప్రస్తుతమున్న 13నుంచి 28కి పెంచాలని కేబినెట్ నిర్ణయించింది. ఇటీవల చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకూ సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడం, కేంద్రంనుంచి రావాల్సిన నిధులు స్థానిక సంస్థలకు సజావుగా అందేలా చూడటం కూడా ఈ నిర్ణయాల వెనుక ఉన్న ఆచరణాత్మక ఆలోచనగా కనిపిస్తోంది. ఎందుకంటే, స్థానిక సంస్థల ఎన్నికలు జాప్యం కావడంవల్ల కేంద్ర నిధుల విడుదలలో జాప్యం జరిగే అవకాశం ఉంటుంది. ఇది గ్రామీణ, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అందుకే, రిజర్వేషన్ల పెంపుతోపాటు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా, స్థానిక పాలనా వ్యవస్థను సత్వరమే క్రియాశీలం చేయాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ నిర్ణయాలు ప్రతిబింబిస్తున్నాయి. మేయర్లు, మున్సిపల్ చైర్పర్సన్ల ప్రత్యక్ష ఎన్నిక విధానం కూడా, స్థానిక పరిపాలనలో పార్టీ అంతర్గత రాజకీయాలకు బదులు, ప్రజల నేరుగా ఎన్నుకునే హక్కుకు ప్రాధాన్యమివ్వడం జవాబుదారీతనాన్ని పెంచే చర్యే.

మొత్తంమీద చూస్తే, బీసీ రిజర్వేషన్ల పెంపు అనేది కేవలం ఒక సంఖ్యాపరమైన మార్పు కాదు.. సామాజిక న్యాయం దిశగా, రాజకీయ అధికారంలో సమాన భాగస్వామ్యం దిశగా నిర్ణయాత్మక ముందడుగు. 34 శాతం రిజర్వేషన్ అంటే కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు, అది నిర్ణయాధికారంలో వాటా, సమాజంలో సముచిత గుర్తింపు అని నాయుడు అభివర్ణించడం ఇందుకు నిదర్శనం. అంతకుముందు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను నామమాత్రంగా మార్చి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని నాయుడు విమర్శించడం, ప్రస్తుత నిర్ణయం ద్వారా ఆ లోటును పూడ్చాలన్న సంకల్పాన్ని స్పష్టం చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, నిర్దిష్ట కాలవ్యవధిలో కేబినెట్ నిర్ణయం ద్వారా ఆచరణలో పెట్టడం, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి నిదర్శనం. బీసీ సముదాయాలు రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న నేపథ్యంలో, స్థానిక పాలనలో వారికి తగిన ప్రాతినిధ్యం లభించడం, గ్రామీణ, పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో వారి గొంతుక మరింత బలంగా వినిపించేందుకు దోహదపడుతుంది. రాజ్యాంగపరమైన, న్యాయపరమైన హద్దుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం స్పష్టం చేయడం, భవిష్యత్తులో ఈ రిజర్వేషన్లు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కోకుండా స్థిరంగా కొనసాగే అవకాశాన్ని పెంచుతుంది. మొత్తంగా, ఈ నిర్ణయం రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, గ్రామీణ, పట్టణ పాలనను మరింత ప్రజాస్వామ్యబద్ధంగా, జవాబుదారీగా తీర్చిదిద్దే దిశగా ఒక కీలక ముందడుగుగా చరిత్రలో నిలిచిపోనుంది. చారిత్రక నిర్ణయమైన సామాజిక న్యాయాన్ని మాటలనుంచి చేతల్లోకి తెచ్చిన కూటమి ప్రభుత్వానికి 'జయహో' చెప్పక తప్పదు!

## పనికొచ్చే పలుకు



# వెతికితే దొరికేది కాదు విల్‌పవర్

క్రమశిక్షణ -బయటినుంచి తెచ్చుకునేది కాదు, మనలోనే దాగివున్న శక్తి. దాన్ని బయటకు తేవాలంటే సరైన శరీర పరిస్థితులు అవసరం. చాలామంది "నాకు విల్‌పవర్ లేదు" అని నిందించుకుంటూ ఉంటారు. కానీ నిజం చెప్పాలంటే సమస్య మనసులో కాదు, శరీరంలోనే ఉంది. మంచి నిద్ర, బలమైన కండరాలు, రక్తంలో సమతుల చక్కెరస్థాయిలు, ప్రశాంతమైన నాడీ వ్యవస్థ -ఇవి సరిగ్గా ఉంటేనే మనసూ క్రమశిక్షణను అనుసరిస్తుంది.

ఈ సూత్రం వెనుక ఉన్న శాస్త్రీయ కారణం అర్థం చేసుకోవడం ముఖ్యం. నిద్ర సరిపోకపోతే మెదడులోని ప్రిఫ్రంటల్ కార్టెక్స్ (నిర్ణయాలు తీసుకునే భాగం) బలహీనపడుతుంది. దీంతో ఆత్మనియంత్రణ కష్టమవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఒడిదొడుకులకు గురైతే, మూడ్ స్వింగ్స్, అలసట, తీవ్రమైన ఆకలి కోరికలు వస్తాయి. ఇలాంటి స్థితిలో "నో" చెప్పే శక్తి తగ్గిపోతుంది. నాడీ వ్యవస్థ నిరంతరం ఒత్తిడిలో ఉంటే, శరీరం 'ఫైట్ ఆర్ ఫ్లైట్' మోడ్‌లోనే ఉండిపోతుంది. దీర్ఘకాలిక ఆలోచన, ప్రణాళిక వేసుకునే సామర్థ్యం దెబ్బతింటుంది. అంటే, మీరు ఎంత గట్టిగా "నేను క్రమశిక్షణగా ఉంటాను" అని నిర్ణయించుకున్నా, శరీరం సహకరించకపోతే నిర్ణయం నిలబడదు.

దీన్ని వేరే కోణంలో చూస్తే -క్రమశిక్షణ అనేది కేవలం మానసిక పోరాటం కాదు, అది జీవక్రియ (మెటబాలిక్) పరిస్థితుల ఫలితం. అమెరికన్ వ్యాపారవేత్త, రచయిత జిమ్ రోన్ ఒకసారి ఇలా అన్నాడు: Discipline is the bridge between goals and accomplishment. అంటే, లక్ష్యాలకు, సాధనకు మధ్య ఉన్న వారధి క్రమశిక్షణే. కానీ ఈ వారధిని నిర్మించాలంటే, ముందు దాని పునాది -శరీర ఆరోగ్యం పటిష్టంగా ఉండాలి. బలహీనమైన పునాదిపై ఎంత గొప్ప వారధి కట్టాలనుకున్నా అది కూలిపోక తప్పదు.

మన తెలుగు సాహిత్యంలోనూ శరీర-మనసుల అనుసంధానాన్ని గురించి పెద్దలు చెప్పిన మాటలున్నాయి. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అనే సంస్కృత సూక్తి తెలుగులోనూ ప్రాచుర్యం పొందింది. అంటే, ఏ ధర్మాన్ని ఆచరించాలన్నా, ఏ లక్ష్యాన్ని సాధించాలన్నా, ముందు శరీరమే ప్రధాన సాధనం అని అర్థం. ఆరోగ్యంలేని శరీరంతో ఎంతటి సంకల్పబలం ఉన్నా అది వాస్తవరూపం దాల్చదు.


ఇప్పుడు మనం ఈ సూత్రాన్ని నిత్యజీవితంలో ఎలా అన్వయించుకోవచ్చో చూద్దాం. ముందుగా, నిద్రను ఒక ఐచ్ఛికాంశంగా కాకుండా, తప్పనిసరి పెట్టుబడిగా చూడండి. రోజుకు 7-8 గంటలు నిద్రపోతే ఆత్మనియంత్రణ శక్తిని పెంచుతుంది. రెండోది, కండరాలను బలోపేతం చేసే వ్యాయామం చేయండి. వెయిట్ ట్రైనింగ్ కేవలం శరీరాన్నే కాదు, మానసిక స్థయిర్యాన్నీ పెంచుతుంది. మూడోది, తరచూ చిన్న చిన్న భోజనాలు తీసుకుంటూ రక్తంలో చక్కెరస్థాయిలను స్థిరంగా ఉంచుకోండి. తీపి పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌ను తగ్గించండి. నాలుగోది, లోతైన శ్వాస వ్యాయామాలు, ధ్యానం ద్వారా నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచుకోండి.

గుర్తుంచుకోండి -క్రమశిక్షణ కోసం మిమ్మల్ని మీరు నిందించుకోవడం మానేయండి. బదులుగా, మీ శరీరాన్ని అర్థం చేసుకుని, దానికి కావాల్సిన మద్దతు ఇవ్వండి. మీ శరీరం ఆరోగ్యంగా, సమతుల్యంగా ఉన్నప్పుడు, క్రమశిక్షణ అనేది పోరాటం కాదు, అది సహజంగా ప్రవహించే ఒక లక్షణంగా మారుతుంది.

# తాలిబన్ దోస్తీకి ఇరాన్ అడ్డు!

అమెరికా బలగాలు 2001లో తరిమికొట్టిన తర్వాత, తాలిబన్ రెండోసారి అఫ్గానిస్తాన్‌ను హస్తగతం చేసుకుని భారత స్వాతంత్ర్య దినోత్సవం నాడు (ఆగస్టు 15) ఐదేళ్లు పూర్తి చేసుకుంది. 1996లో పాకిస్తాన్ క్రియాశీల మద్దతుతో కాబూల్‌ను తొలిసారి స్వాధీనం చేసుకున్న తాలిబన్‌కు, అప్పట్లో సౌదీ అరేబియా, యూఏఈలు మాత్రమే గుర్తింపు ఇచ్చాయి. అహ్మద్ షా మసూద్ నేతృత్వంలోని నార్తర్న్ అలయెన్స్‌కు సైనిక, రాజకీయ మద్దతు ఇస్తూ భారత్, ఇరాన్ తాలిబన్ పెరుగుదలను వ్యతిరేకించాయి. 20 ఏళ్ల అమెరికా సైనిక ఉనికి తర్వాత, 2020 ఫిబ్రవరిలో దోహాలో తాలిబన్‌తో షరతులతో కూడిన శాంతి ఒప్పందంపై ట్రంప్ తొలి పాలనా కాలంలో సంతకం జరిగింది. బలగాల ఉపసంహరణను బైడెన్ హడావిడిగా అమలు చేయడంతో, అష్రఫ్ ఘనీ ప్రభుత్వానికి ప్రజా మద్దతు వేగంగా కుప్పకూలింది, 2021 ఆగస్టు 15న తాలిబన్ మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఐదేళ్ల తర్వాత, తాలిబన్ పాలనలో అఫ్గానిస్తాన్ దేశీయంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆంక్షలు, అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి బహిష్కరణ కారణంగా ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోంది. 2025 అక్టోబర్ నుంచి పాకిస్తాన్‌తో కీలక సరిహద్దు మార్గాలు మూసుకుపోగా, ఫిబ్రవరి 2026 నుంచి బహిరంగ ఘర్షణలతో పరిస్థితి మరింత దిగజారింది. పాకిస్తాన్ వైమానిక దాడుల్లో దాదాపు 500మంది పౌరులు మరణించారు. ఫిబ్రవరి 28 నుంచి కొనసాగుతున్న ఇరాన్ యుద్ధం, ఇరాన్ మీదుగా అఫ్గానిస్తాన్ కమ్యూనికేషన్ మార్గాలనూ దెబ్బతీసింది. విదేశీ మానవతా, అభివృద్ధి సాయం 2020లో 400 కోట్ల డాలర్ల నుంచి 2025లో 120 కోట్ల డాలర్లకు పడిపోయింది. ఇరాన్, పాక్‌నుంచి తిరిగి పంపిన 40 లక్షలకుపైగా శరణార్థులు మొత్తం జనాభాలో 10 శాతం అదనపు భారంగా మారారు.


అయితే, ఆర్థిక, వ్యూహాత్మక సవాళ్లు ఉన్నప్పటికీ, దశాబ్దాల ఉగ్రవాదం అనంతరం తాలిబన్ స్థిరత్వాన్ని, దేశీయ శాంతిని నెలకొల్పగలిగిందని 'ది ఎకనామిస్ట్' పత్రిక విశ్లేషిస్తోంది. తమ మొదటి పాలనా కాలం (1996-2001)తో పోలిస్తే ఇప్పుడు "ఆధునిక రాజ్యాన్ని" మెరుగ్గా నడుపుతున్నారని అది పేర్కొంది -ఘనీ పాలనలో పనిచేసిన సివిల్ సర్వెంట్లలో చాలామంది తొలగించబడకుండా కొనసాగడం, పరిపాలనా కొనసాగింపునకు ఒక కారణం. అయితే, తాలిబన్ ప్రధాన దేశీయ సమస్య మహిళలపట్ల వారి సిద్ధాంతపరమైన వైఖరి నుంచే ఉద్భవిస్తోంది. మహిళలు స్వతంత్రంగా వ్యవహరించడం, ప్రయాణించడం, చదువుకోవడం, పనిచేయడం వంటి హక్కులను నిరాకరిస్తూ 160కి పైగా డిక్రీలు జారీ చేశారు. ఐరాస మహిళా విభాగం 5వేలమంది అఫ్గాన్లను సర్వే చేసిన ఇటీవలి నివేదిక ప్రకారం, 2021 ఆగస్టుకు ముందుతో పోలిస్తే తమ పరిస్థితి దిగజారిందని 55 శాతం పురుషులు, 65 శాతం మహిళలు భావిస్తున్నారు. మహిళలు వైద్యులుగా చదువుకునే అవకాశం లేకపోవడంతో మహిళా వైద్యుల కొరత పెరిగి, మహిళలకు వైద్య సదుపాయాల లభ్యత తగ్గుతోంది. 12 ఏళ్లు దాటిన బాలికలు పాఠశాలకు వెళ్లడంపై నిషేధం, వారి భవిష్యత్తును మరింత అంధకారంలోకి నెట్టేస్తోందని యునెస్కో పేర్కొంది. జులైలో షియా, తాజిక్ జనాభా అధికంగా ఉన్న హెరాత్‌లో "విద్య, పని, స్వేచ్ఛ" నినాదాలతో నిరసనలు చెలరేగాయి. తాలిబన్



ప్రభుత్వం ఏకశిలా సదృశం కాదు, అనేక వర్గాలున్నా, కాందహార్ కేంద్రంగా ఉన్న సుప్రీం లీడర్ షేక్ హైబతుల్లా అఖుంద్జాదా అధికారాన్ని కేంద్రీకృతం చేసుకున్నారు. మైనింగ్ నుంచి వచ్చే అనధికారిక ఆదాయంతో 8వేలమంది విధేయులైన బలగాన్ని నిర్మించుకున్నారు. దీంతో సమీప భవిష్యత్తులో పాలనలో సరళీకరణ జరిగే అవకాశం తక్కువగానే కనిపిస్తోంది.

భూపరివేష్టిత దేశంగా, తన ఇరుగుపొరుగు దేశాలైన ఇరాన్, పాకిస్తాన్‌లతో అఫ్గానిస్తాన్ సంబంధాలు అత్యంత కీలకం. తాలిబన్ మొదటి పాలనా కాలంలో షియా హజారాలపై దురాగతాలు, కొందరు ఇరాన్ దౌత్యవేత్తల హత్యలు, నార్తర్న్ అలయెన్స్‌కు ఇరాన్ మద్దతు ఇచ్చిన చరిత్ర ఇరాన్‌తో సంబంధాలను దెబ్బతీశాయి, రెండు దేశాలు దాదాపు యుద్ధానికి దిగే పరిస్థితి కూడా వచ్చింది. అమెరికా బలగాల ఉపసంహరణ అనంతరం, ఉగ్రవాద సంస్థ ఐఎస్-కేపీని అణచివేయడంలో ఇరు దేశాల ప్రయోజనాలు ఏకమయ్యాయి. పాకిస్తాన్‌తో సంబంధాలు దెబ్బతిన్న తర్వాత అఫ్గానిస్తాన్‌కు వాణిజ్యం, సరఫరాలకు ఇరాన్ మార్గం కల్పించింది. తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకుండానే ఇరాన్ చురుకైన దౌత్య సంబంధాలను కొనసాగిస్తోంది. భారత్-తాలిబన్ సంబంధాలు కూడా ఇలాంటి చక్రాన్నే అనుసరించాయి. తాలిబన్ మొదటి పాలనా కాలంలో ఐసీ-814 హైజాకింగ్‌లో వారి పాత్ర, 2008లో కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయంపై ప్రాణాంతక దాడి, భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న ఐఎస్ఐ-ప్రేరేపిత సంస్థల ఉగ్రవాద శిక్షణా శిబిరాల గురించి భారత్ ఆందోళన చెందింది. అమెరికా, దాని మిత్రదేశాలు తాలిబన్‌ను తరిమికొట్టి అఫ్గానిస్తాన్‌ను ఆక్రమించినప్పుడు భారత్ ఊపిరి పీల్చుకుంది. అయితే, తాలిబన్ 2.0, డ్యూరాండ్ రేఖపై పాకిస్తాన్‌తో అఫ్గానిస్తాన్ చారిత్రక ఉద్రిక్తతను పునరుద్ధరించింది. ఈ కృత్రిమ సరిహద్దు రెండు దేశాల పష్తూన్ తెగలను వేరు చేస్తుంది. పాకిస్తాన్ భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకునే తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఫైటర్లకు అఫ్గానిస్తాన్ ఆశ్రయం కల్పించడం ప్రధాన చికాకుగా మారింది.

ఈ పరిణామం భారత్‌ను తాలిబన్‌వైపు మళ్లించింది.. "శత్రువుకు శత్రువు మిత్రుడు కావచ్చు" అన్న సూత్రాన్ని ధృవీకరిస్తూ. తాలిబన్ అనుసరించే దేవబందీ ఇస్లాం 1867లో భారత్‌లోనే రూపొందింది. 1967నాటికి ప్రపంచవ్యాప్తంగా 8,000 దేవబందీ పాఠశాలలు ఏర్పడ్డాయి. తాలిబన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాకీ 2025 నవంబర్‌లో తన తొలి భారత పర్యటనలో దేవబంద్ సెమినరీని సందర్శించడం ఇందుకు నిదర్శనం. తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకుండానే భారత్ ఇప్పుడు మానవతా, ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. 2026-27 బడ్జెట్‌లో అఫ్గానిస్తాన్ కోసం రూ.150 కోట్లు కేటాయించింది. గత ఏడాదిగా ఢిల్లీ-కాబూల్ మధ్య ఉన్నత స్థాయి దౌత్య మార్పిడులు గణనీయంగా పెరిగాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఇటీవల వెల్లడించారు. కాబూల్‌లోని తన సాంకేతిక మిషన్‌ను పూర్తిస్థాయి రాయబార కార్యాలయంగా భారత్ 2025 అక్టోబర్‌లో అప్‌గ్రేడ్ చేయగా, జనవరి 2026లో తాలిబన్ నియమించిన తొలి దౌత్యవేత్త నూర్ అహ్మద్ నూర్ ఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయ బాధ్యతలు స్వీకరించారు -2021 తర్వాత భారత్‌కు తాలిబన్ పంపిన తొలి దౌత్యవేత్త ఇదే. జమ్మూ కశ్మీర్‌పై భారత సార్వభౌమత్వానికి మద్దతుగా తాలిబన్ సంయుక్త ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. అయితే, ఇరాన్ యుద్ధం కారణంగా ఇరాన్‌లోని చాబహార్ పోర్టు ద్వారా అఫ్గానిస్తాన్, మధ్య ఆసియాకు కొత్త అనుసంధానతను సృష్టించాలన్న భారత పెట్టుబడులకు అంతరాయం ఏర్పడింది. గల్ఫ్‌లో అమెరికా-ఇజ్రాయెల్ అక్షం వైపు భారత్ మొగ్గు చూపడం, భారత వ్యూహాత్మక విశ్వసనీయతపై ఇరాన్‌కు సందేహాలు కలిగించే అవకాశం ఉంది. అందుకే, పాకిస్తాన్ ప్రాంతీయ పాత్రను, విస్తరిస్తున్న చైనా ప్రభావాన్ని సమతుల్యం చేసుకోవడానికి కొత్త భారత్-తాలిబన్ సంబంధాలు కీలకమే అయినా, ఇరాన్ సహకారం లేకుండా అది సాధ్యం కాదు. సార్క్ సభ్యదేశంగా అఫ్గానిస్తాన్ ప్రాంతీయ స్థిరత్వానికి, ఉగ్రవాద నిరోధానికి కీలకంగా కొనసాగుతూనే ఉంటుంది. మానవ హక్కులను విస్మరించే మెజారిటేరియన్ దృక్పథం కంటే, లౌకిక, ఉదారవాద భారత్ ఈ నిమగ్నతను మరింత సమర్థంగా కొనసాగించగలదు. ■




మీ ఆర్థిక ఎదుగుదలలో 80శాతం ప్రయోజనం.. మీరు తీసుకునే 20శాతం కీలక నిర్ణయాలు, అలవాట్ల నుంచే వస్తుంది. అందుకే స్థిరంగా పెట్టుబడి పెట్టడం, ఆదాయం పెంచుకోవడం, అప్పులు తగ్గించుకోవడం లాంటి కొన్ని ముఖ్యమైన అలవాట్లను గుర్తించి, వాటిపైనే పూర్తిగా దృష్టి పెట్టండి. అన్నింటినీ ఒకేసారి మార్చడానికి బదులు.. ఈ కొన్నింటిని పక్కాగా పాటిస్తే చాలు గొప్ప ఫలితాలు సాధించవచ్చు. ఆర్థిక ఎదుగుదలకు ఇవి అత్యంత ముఖ్యం. అన్నీ కాదు, అవసరమైనవి చేయండి - అదే మిమ్మల్ని ఆర్థిక స్వేచ్ఛకు చేరుస్తుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# మనిషా.. యంత్రమా?



మనిషి-యంత్రం మధ్య అంతరాన్ని చెరిపేయాలన్న లక్ష్యంతో చైనా స్టార్టప్ 'ఏహెడ్‌ఫామ్' రూపొందించిన 'ఆరిజిన్ ఎం1' రోబో తల, చూసేవారికి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. కొలంబియా వర్సిటీలో శిక్షణ పొందిన ఇంజినీర్ యుహాంగ్ హూ 2024లో స్థాపించిన ఈ సంస్థ, మానవ సూక్ష్మ హావభావాలను అనుకరించే రోబో తలను ఆవిష్కరించింది. సిలికాన్ చర్మం కింద 25నుంచి 42 అల్ట్రా-సైలెంట్ మైక్రో మోటార్లు కృత్రిమ కండరాలను నియంత్రిస్తూ, హావభావాలను పునఃసృష్టిస్తాయి. కనుపాపల్లో దాచిన కెమెరాలు పరిసరాలను స్కాన్ చేయగా, మైక్రోఫోన్లు, స్పీకర్లు వాయిస్ ఇంటరాక్షన్‌ను సాధ్యం చేస్తాయి. అత్యాధునిక వెర్షన్ ధర ఏకంగా 1.5 లక్షల డాలర్లు (సుమారు రూ.1.3 కోట్లు). ప్రస్తుతానికి డెస్క్‌పై పెట్టుకుని చూసుకునే ఖరీదైన ఆట వస్తువే అయినా, భవిష్యత్తులో లిప్-సింకింగ్‌ను జోడించి, పెద్ద భాషా నమూనాలతో అనుసంధానం చేయాలని, మీరు ఏం మాట్లాడారో మాత్రమే కాదు, ఎలా మాట్లాడారో కూడా అర్థం చేసుకుని స్పందించేలా తీర్చిదిద్దాలని కంపెనీ యోచిస్తోంది.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారికి ఎంతో మేలు చేసే వాకింగ్.. ఎలా పనిచేస్తుందంటే..

ఫ్యాటీ లివర్ సమస్య ప్రస్తుతం చాలామందిలో కనిపిస్తోంది. అధిక బరువు, మధుమేహం, కొలెస్ట్రాల్ పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి జీవనశైలి కారణాలతో కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. ఈ సమస్యను నియంత్రించడానికి ఆహారంలో మార్పులతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా ముఖ్యమే. అయితే ఖరీదైన వర్కౌట్స్ చేయాల్సిన అవసరం లేకుండా రోజువారీ వేగవంతమైన నడకతోనే కాలేయ ఆరోగ్యానికి ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. నడిచేప్పుడు కండరాలు ఎక్కువ గ్లూకోజ్, శక్తిని ఉపయోగిస్తాయి. దీనివల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడి రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. అలాగే కాలేయంలో కొవ్వు నిల్వ అవడానికి కారణమయ్యే కొన్ని మెటబాలిక్ సమస్యలను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుంది.



## నొప్పులు, వాపులు తగ్గేందుకు..

వేగంగా నడవడం వల్ల శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో కాలక్రమేణా శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును ఉపయోగించుకునే అవకాశం పెరుగుతుంది. అలాగే కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో, శరీరంలో వాపును తగ్గించడంలో కూడా క్రమం తప్పకుండా వ్యాయామం సహాయపడుతుంది. ఇవన్నీ ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన ముఖ్యమైన కారకాలను నియంత్రించడంలో ఉపయోగపడతాయి. కాలేయ ఆరోగ్యం కోసం వారానికి 150 నుంచి 300 నిమిషాల మోస్తరు తీవ్రత కలిగిన శారీరక శ్రమ చేయాలని సూచిస్తున్నారు. అంటే రోజుకు సుమారు 30 నుంచి 45 నిమిషాల పాటు ఎక్కువ రోజులు బ్రిస్క్ వాకింగ్ చేయవచ్చు. ప్రస్తుతం వ్యాయామం చేయని వారు మొదటి రోజే ఎక్కువసేపు నడవాల్సిన అవసరం లేదు. తక్కువ సమయంతో ప్రారంభించి, క్రమంగా నడక సమయం, వేగాన్ని పెంచుకోవచ్చు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న మార్పులు కూడా శారీరక శ్రమను పెంచుతాయి. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించడం, పని మధ్యలో కొద్దిసేపు నడవడం, భోజనం తర్వాత నడవడం వంటి అలవాట్లు మొత్తం శారీరక కదలికను పెంచుతాయి. అప్పుడప్పుడు మాత్రమే వ్యాయామం చేయడం కంటే ప్రతిరోజూ కదలికను ఒక అలవాటుగా మార్చుకోవడం ముఖ్యమని నిపుణుల సూచనలు చెబుతున్నాయి.

## నడకతోనే సమస్య తీరదు..

అయితే నడకతోనే ఫ్యాటీ లివర్ పూర్తిగా నయం అవుతుందని భావించకూడదు. నడక కాలేయంలో పేరుకున్న కొవ్వును తగ్గించడంలో, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి మెటబాలిక్ అంశాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కానీ ఫ్యాటీ లివర్ తీవ్రత, శరీర బరువు, ఆహారం, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, శారీరక శ్రమ, కాలేయ వ్యాధి దశ వంటి అనేక అంశాలపై ఫలితం ఆధారపడి ఉంటుంది. బరువు తగ్గడం కూడా కాలేయ ఆరోగ్యానికి అదనపు ప్రయోజనాన్ని అందిస్తుంది. శరీర బరువులో సుమారు 5 శాతం తగ్గడం కాలేయంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. 7 నుంచి 10 శాతం వరకు బరువు తగ్గితే కాలేయంలోని వాపు మెరుగుపడటానికి, ప్రారంభ దశలో ఉన్న కాలేయ నష్టాన్ని కొంతమందిలో తగ్గించడానికి అవకాశం ఉంటుంది. అయితే బరువు తగ్గడం వెంటనే కనిపించకపోయినా వ్యాయామం ఆపకూడదు. వ్యాయామం వల్ల బరువులో పెద్ద మార్పు లేకపోయినా కాలేయానికి ప్రయోజనం కలుగుతుంది.

## హారమూ ముఖ్యమే..

ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడానికి నడకతోపాటు సమతుల్యమైన ఆహారం కూడా అవసరం. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు కలిగిన ప్రోటీన్ ఆహారాలను తీసుకోవడం మంచిది. చక్కెర కలిగిన పానీయాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, సంతృప్త కొవ్వులు ఎక్కువగా ఉండే పదార్థాలను పరిమితం చేయాలి. నడకకు తోడు వారానికి రెండు నుంచి మూడు సార్లు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ లేదా రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయడం కూడా ఉపయోగపడుతుంది. ఇవి కండరాలను బలోపేతం చేయడంతోపాటు శరీరం గ్లూకోజ్‌ను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. మంచి నిద్రతోపాటు మధుమేహం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలను నియంత్రించడం కూడా ఫ్యాటీ లివర్ నిర్వహణలో కీలకం. ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన మరో ముఖ్యమైన విషయం.. ప్రారంభ దశలో చాలామందికి ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. ఎలాంటి అసౌకర్యం లేకపోయినా కాలేయంలో కొవ్వు పేరుకుపోయి ఉంటుంది. సమస్యను నిర్లక్ష్యం చేస్తే కొంతమందిలో కాలేయంలో వాపు, ఆపై ఫైబ్రోసిస్ లేదా మచ్చలు ఏర్పడే అవకాశం ఉంటుంది. పరిస్థితి మరింత తీవ్రమైతే సిరోసిస్, కాలేయ వైఫల్యం వంటి సమస్యలు వస్తాయి. కాలేయ క్యాన్సర్ ప్రమాదం కూడా పెరుగుతుంది.

## వైద్య పర్యవేక్షణ అవసరం..

అందుకే ఫ్యాటీ లివర్ ఉన్నట్లు ఇప్పటికే నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా వైద్య పర్యవేక్షణలో ఉండటం మంచిది. అవసరాన్ని బట్టి రక్త పరీక్షలు, స్కానింగ్ లేదా ఇతర పరీక్షలను వైద్యులు సూచిస్తారు. మధుమేహం, అధిక బరువు లేదా కాలేయ పరీక్షల్లో అసాధారణ ఫలితాలు ఉన్నవారు కూడా కాలేయ ఆరోగ్యం గురించి వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడంలో రోజువారీ బ్రిస్క్ వాకింగ్ ఒక సులభమైన, అందుబాటులో ఉండే అలవాటు. రోజూ వేసే ప్రతి అడుగు కాలేయ ఆరోగ్యానికి ఉపయోగపడే జీవనశైలి మార్పులో భాగమే. నడకతోపాటు ఆరోగ్యకరమైన ఆహారం, బరువు నియంత్రణ, స్ట్రెంగ్త్ వ్యాయామాలు, మంచి నిద్ర, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యల నియంత్రణను కలిపి కొనసాగిస్తే ఫ్యాటీ లివర్ ను మరింత మెరుగ్గా నిర్వహించవచ్చు.

# నెలనెలా మహిళల్లో వచ్చే హార్మోన్ల మార్పుల సమస్యలకు పరిష్కారం ఏమిటి.. నిపుణులు ఏం చెబుతున్నారు..?



ప్రతి నెలా పీరియడ్స్ సమయంలో చాలామంది మహిళలు కడుపు నొప్పి, అలసట, ఉబ్బరం, మూడ్ స్వింగ్స్, తీపి పదార్థాలపై కోరిక వంటి సమస్యలను ఎదుర్కొంటుంటారు. హార్మోన్లలో మార్పులు, రక్తస్రావం, కండరాల సంకోచాల కారణంగా ఈ సమయంలో శరీరానికి ఐరన్, మెగ్నీషియం వంటి కొన్ని పోషకాలు మరింత అవసరం అవుతాయి. అయితే రోజువారీ ఆహారంలో పాటించే కొన్ని అలవాట్లు ఈ అసౌకర్యాలను మరింత పెంచే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపు నొప్పి, అలసట ఉన్నప్పుడు చాలామంది టీ లేదా కాఫీపై ఆధారపడుతుంటారు. కెఫీన్‌ను అధికంగా తీసుకోవడం వల్ల క్రాంప్స్, అలసట మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. కెఫీన్‌లో ఉండే టానిన్లు ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి. రక్తనాళాల సంకోచానికి కూడా కారణమయ్యే అవకాశం ఉంటుంది. దీనికి బదులుగా వెచ్చని వాము నీటిని తీసుకోవడం ఒక ప్రత్యామ్నాయంగా చెబుతున్నారు.

## చిన్న మొత్తంలో తినాలి..

పీరియడ్స్ సమయంలో హార్మోన్ల స్థాయిలు తగ్గడం వల్ల మూడ్‌ను ప్రభావితం చేసే మెదడులోని రసాయనాల్లో మార్పులు వస్తాయి. ఈ సమయంలో కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయడం వల్ల మూడ్ స్వింగ్స్, శక్తి తగ్గడం మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల వేడిగా, తేలికగా తీసుకునే బజ్రా ఖిచ్డీ లేదా రాజ్‌గిరా వంటి ఆహారాలను చిన్న మొత్తంలో తీసుకోవచ్చు. పీరియడ్స్ సమయంలో తీపి పదార్థాలపై తీవ్రమైన కోరిక కలగడం కూడా సాధారణమే. ఇలాంటి సమయంలో ప్రాసెస్ చేసిన చాక్లెట్లను ఎక్కువగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి, మొటిమల సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. చాక్లెట్లకు బదులుగా వేయించిన శనగలు లేదా నల్ల నువ్వులను బెల్లంతో కలిపి తీసుకోవచ్చు. అలాగే నువ్వుల బెల్లం లడ్డూలను కూడా ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు.

## సులభంగా జీర్ణం అవ్వాలి..

పీరియడ్స్ సమయంలో జీర్ణక్రియపై కూడా దృష్టి పెట్టాలి. ఈ సమయంలో శరీరానికి వేడి, సులభంగా జీర్ణమయ్యే ఆహారం అవసరమవుతుంది. పచ్చి లేదా చల్లని ఆహారాలను జీర్ణం చేసుకోవడానికి శరీరానికి ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. దీంతో కొందరిలో కడుపు అసౌకర్యం లేదా క్రాంప్స్ మరింత ఇబ్బంది పెడుతుంది. అందువల్ల చల్లని సలాడ్లకు బదులుగా వేడి మసూర్ దాల్ వంటి సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. పీరియడ్స్ సమయంలో విపరీతమైన అలసట, నీరసం అనిపించినప్పుడు దాన్ని సాధారణంగానే తీసుకోకూడదు. రక్తస్రావం కారణంగా శరీరంలోని ఐరన్ నిల్వలు తగ్గే అవకాశం ఉంటుంది. ఐరన్ అవసరాలను తీర్చుకోవడంలో సహాయపడేందుకు నిమ్మరసంతో కలిపిన నీటిలో నానబెట్టిన ఒక టేబుల్‌స్పూన్ హాలిమ్ విత్తనాలను తీసుకోవాలి. పీరియడ్స్ సమయంలో ఆహారపు అలవాట్లు కూడా శారీరక అసౌకర్యంపై ప్రభావం చూపిస్తాయి. అధికంగా టీ, కాఫీ తీసుకోవడం, కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయడం, ప్రాసెస్ చేసిన చాక్లెట్లను ఎక్కువగా తినడం వంటి అలవాట్లకు బదులుగా వెచ్చని, సులభంగా జీర్ణమయ్యే, పోషకాలు కలిగిన ఆహారాలను ఎంచుకోవడం ద్వారా అవసరమైన పోషకాలను అందించవచ్చు.


# కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వాళ్లు బీట్‌రూట్ తినవచ్చా..?



మధుమేహం అధిక రక్తపోటు మారిన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా బీట్‌రూట్ కిడ్నీ రోగులకు మంచిదా..? లేక హానికరమా..? అనే సందేహానికి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ అండ్ డైజెస్టివ్ అండ్ కిడ్నీ డిసీజెస్ ప్రకారం.. కాల్షియం ఆక్సలేట్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటే కిడ్నీలో రాళ్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారు ఆక్సలేట్ ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. బీట్‌రూట్ కూడా అలాంటి ఆహారాల్లో ఒకటి. అయితే కిడ్నీ బాధితులు బీట్‌రూట్‌ను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. కాల్షియం ఆక్సలేట్ రాళ్ల సమస్య లేకపోతే.. వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు పరిమిత మోతాదులో బీట్‌రూట్ తీసుకోవచ్చు. అంటే, బీట్‌రూట్ తినాలా.. వద్దా..? అనేది మీకు ఉన్న కిడ్నీ సమస్య రకాన్ని బట్టి నిర్ణయించాలి. వైద్యుల సలహా లేకుండా ఆహారంలో పెద్ద మార్పులు చేయకపోవడం మంచిది. కాల్షియం ఆక్సలేట్ రాళ్లు వచ్చే ప్రమాదం ఉన్నవారు ఈ కింది ఆహారాలను పరిమితంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటిలో పాలకూర, బీట్‌రూట్, బాదం, వేరుశెనగ, చాక్లెట్, అధిక ఉప్పు,

ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్యాక్ చేసిన స్నాక్స్, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు, వీటిని కూడా తగ్గించడం మంచిది. కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యులు లేదా పోషకాహార నిపుణులు సూచించిన ఆహారాన్నే పాటించాలి. సాధారణంగా తగినంత నీరు తాగడం, తాజా పండ్లు, తక్కువ ఆక్సలేట్ ఉన్న కూరగాయలు, తృణ ధాన్యాలు, అవసరమైన మోతాదులో ప్రొటీన్ తీసుకోవడం మంచిది. అలాగే ఉప్పు వినియోగాన్ని తగ్గించి, ప్యాక్ చేసిన, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. వైద్యుల సూచనల మేరకు ఆహారం తీసుకోవడమే కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గం అని చెప్పవచ్చు.

# ఉప్పు ఎక్కువగా తింటే శరీరంలో కాల్షియం లోపిస్తుందా..?




ఉప్పు మన రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉండే పదార్థం. ఏ వంటలోనైనా ఉప్పు లేకపోతే అసలు రుచే ఉండదు. అందుకే 'అన్నేసి చూడు.. నన్నేసి చూడు' అని ఉప్పు గర్విస్తుందని పెద్దలు చెబుతుంటారు. ఉప్పు నాడీవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే ఈ ఉప్పును అధికంగా తింటే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవడం ఆరోగ్యకరం. అధిక ఉప్పు వాడకం రక్తపోటును పెంచుతుంది. గుండె సమస్యలకు, కిడ్నీ సమస్యలకు దారితీస్తుంది. అంతేకాకుండా అధికంగా ఉప్పు తీసుకోవడంవల్ల శరీరంలో ఉన్న కాల్షియం మూత్రం ద్వారా ఎక్కువగా బయటకు వెళ్తుంది. దాంతో కాల్షియం లోపం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాల్షియం ఎముకలు, దంతాల బలానికి చాలా అవసరం. కాబట్టి ఉప్పు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కాల్షియం తగ్గి, ఎముకల బలహీనతకు దారితీస్తుంది. ఈ ఎముకల బలహీనత అనేది ముఖ్యంగా ఇప్పటికే కాల్షియం లోపం ఉన్నవారిలో, వృద్ధుల్లో, మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అయితే ఈ సమస్య ఉన్నవాళ్లు ఉప్పును పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. మితంగా తీసుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. అదేవిధంగా పాలు, పెరుగు, ఆకుకూరలు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. సరైన ఆహార అలవాట్లు పాటిస్తే ఉప్పువల్ల వచ్చే కాల్షియం లోపాన్ని తగ్గించుకోవచ్చు.

## పాకిస్థాన్ , ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు రంగం సిద్ధం..
## పూర్తి షెడ్యూల్, జట్లు, లైవ్ స్ట్రీమింగ్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ టూర్ లో భాగంగా 3 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 19 నుంచి 23 వరకు లీడ్స్‌లోని హెడింగ్లే వేదికగా జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్ట్ ఆగస్టు 27 నుంచి 31 వరకు చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో, మూడో టెస్ట్ సెప్టెంబర్ 9 నుంచి 13 వరకు బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరగనుంది. జూన్ 2027లో ది ఓవల్‌లో జరగబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో టాప్–2లో నిలవాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్ గెలవడం అత్యంత కీలకంగా మారింది.

బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ తర్వాత ఇంగ్లాండ్ ఆడుతున్న తొలి రెడ్–బాల్ సిరీస్ ఇది. ఈ సిరీస్ కోసం జో రూట్ తిరిగి ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. తొలి రెండు టెస్టుల కోసం డ్యాన్ లారెన్స్, మాజీ వైస్ కెప్టెన్ ఆలీ పోప్ జట్టులోకి పునరాగమనం చేయగా, గాయం కారణంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొలి రెండు టెస్టులకు ప్రకటించారు.

**పాకిస్థాన్‌కు కెప్టెన్ గాయం టెన్షన్..**
**అఫ్రిది ఔట్:**

మరోవైపు పాకిస్థాన్ జట్టు బాబర్ అజామ్ సారథ్యంలో బరిలోకి దిగుతోంది. జూలై 2026లో షాన్ మసూద్ స్థానంలో బాబర్ టెస్ట్ కెప్టెన్సీ చేపట్టినప్పటికీ, వేలి గాయం కారణంగా లీడ్స్‌లో జరిగే తొలి టెస్టుకు అతను ఆడటం అనుమానంగా మారింది. ఇక స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిదిని ఈ పర్యటనకు ఎంపిక చేయకపోవడంతో సీనియర్ బౌలర్ మహమ్మద్ అబ్బాస్ పాక్ పేస్ విభాగాన్ని నడిపించనున్నాడు.

**లైవ్ స్ట్రీమింగ్ వివరాలు**


భారతదేశంలో ఈ ఇంగ్లాండ్ వర్సెస్ పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ (రాశీఅం రాజూశీతీం చీవ్షశీతీఎ) టీవీ ఛానెళ్లలో ప్రత్యక్షంగా చూడవచ్చు.. అలాగే డిజిటల్ వీక్షకులు సోనీ లివ్ (రాశీఅం రా×ఎ) యాప్‌లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా మ్యాచ్‌లను వీక్షించవచ్చు. తొలి టెస్ట్ మ్యాచ్ ప్రతిరోజు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమవుతుంది.

**ఇరు జట్లు:**

పాకిస్థాన్ జట్టు: బాబర్ అజామ్ (కెప్టెన్), షాన్ మసూద్, అబ్దుల్లా షఫీక్, అజాన్ అవాయిస్, ఇమామ్–ఉల్–హక్, ముహమ్మద్ అవాయిస్ జాఫర్, మహమ్మద్ రిజ్వాన్ (కీపర్), ముహమ్మద్ ఘాజీ ఘోరీ (కీపర్), అమీర్ జమాల్, సల్మాన్ అలీ ఆగా, సౌద్ షకీల్, అలీ ఉస్మాన్, సాజిద్ ఖాన్, ఖుర్రం షెహజాద్, మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ, ఉబైద్ షా

ఇంగ్లాండ్ జట్టు: జో రూట్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జోర్డాన్ కాక్స్, బెన్ డకెట్, మాథ్యూ ఫిషర్, ఎమిలియో గే, డ్యాన్ లారెన్స్, ఆలీ పోప్, ఆలీ రాబిన్సన్, జేమీ స్మిత్, జోష్ టంగ్

## డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్.. టెన్నిస్ నుంచి నిక్ కిర్గియోస్ సస్పెండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నంబర్ 13 నిక్ కిర్గియోస్ నిషేధిత డ్రగ్స్ వాడుతూ దొరికిపోవడంతో క్రీడా ప్రపంచంలో తీవ్ర కలకలం రేపుతుంది. ఇటీవల నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో అతను డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడంతో ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటెగ్రిటీ ఏజెన్సీ అతనిపై సడన్‌గా ప్రొవిజనల్ బ్యాన్ విధించింది. జూన్ 22న జరిగిన మల్లోర్కా ఓపెన్ టోర్నీ సందర్భంగా నిక్ కిర్గియోస్‌కు డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో అతను కొకైన్ వాడినట్లు నిర్ధారణ కావడంతో ఆగస్టు 4వ తేదీన అతనిపై తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సస్పెన్షన్ అమలులో ఉన్నంత వరకు అతను గ్రాండ్‌స్లామ్‌లు సహా ఎలాంటి ప్రొఫెషనల్ టెన్నిస్ టోర్నమెంట్లలో ఆడటానికి, కోచింగ్ ఇవ్వడానికి లేదా చివరికి మ్యాచ్‌లకు హాజరవడానికి కూడా పర్మిషన్ ఉండదు. ఈ షాకింగ్ న్యూస్ బయటకు రాగానే నిక్ కిర్గియోస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ.. తన తప్పును బహిరంగంగా ఒప్పుకున్నాడు. నేను ఒక విపరీతమైన పెద్ద తప్పు చేశాను, దానికి పూర్తి బాధ్యత నాదే.. నా అభిమానులు, కుటుంబం, స్పాన్సర్లు, ముఖ్యంగా నన్ను రోల్ మోడల్‌గా భావించే పిల్లలకి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. నావల్ల ఇలాంటి రాంగ్ ఎగ్జాంపుల్ సెట్ అయినందుకు నా మీద నాకే చాలా నిరాశగా ఉందంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు.

**డిప్రెషన్ పై మనసు విప్పిన టెన్నిస్ స్టార్:**

తన పరిస్థితికి గల కారణాలను వివరిస్తూ.. గడిచిన రెండేళ్లుగా మోకాలు, మణికట్టు గాయాలతో శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యానని చెప్పాడు. మైండ్ అనుకున్నట్లు శరీరం సహకరించకపోవడంతో, కెరీర్ ముగింపునకు వచ్చేసిందనే ఘోరమైన సత్యాన్ని తట్టుకోలేక చాలా ఒంటరిగా, నిస్సహాయంగా ఫీల్ అయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ తప్పును సరిదిద్దుకోవడానికి రాబోయే 28 రోజుల పాటు సోషల్ మీడియాకు, పబ్లిక్ లైఫ్‌కు దూరంగా ఉంటానని ప్రకటించాడు.

**డేంజర్‌లో పడిన ప్రొఫెషనల్ కెరీర్:**

గాయాల సమస్యల వల్ల ఈ సీజన్‌లో కేవలం నాలుగు సింగిల్స్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన 31 ఏళ్ల నిక్ కిర్గియోస్, చివరిగా వింబుల్డన్ డబుల్స్‌లో ఆడి ఫస్ట్ రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఇప్పుడు ఈ కొకైన్ రచ్చతో అతని ప్రొఫెషనల్ కెరీర్ మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. తప్పును రియలైజ్ అయి బ్రేక్ తీసుకుంటున్న కిర్గియోస్, మళ్లీ లైఫ్‌ను ట్రాక్‌లోకి తెచ్చుకుని ఎంతవరకు స్ట్రాంగ్‌గా కంబ్యాక్ ఇస్తాడో లేదో అనేది వేచి చూడాల్సింది.

## శ్రీలంక గడ్డపై మానవ్ సుతార్ చరిత్ర.. దిగ్గజాల రికార్డులు బ్రేక్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్‌ల రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. సుతార్ విజృంభణకు దేవదత్ పడిక్కల్ సెంచరీ తోడవడంతో భారత్ 165 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యంలో నిలిచింది.

**మ్యాచ్ సాగిందిలా..**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (230 బంతుల్లో 167; 15 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కేఎల్ రాహుల్ (82), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (51) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత స్పిన్నర్ల ధాటికి 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నిరోషన్ డిక్వెల్లా (80), సోనల్ దినుష (100) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, మానవ్ సుతార్ (4/76) విజృంభించడంతో శ్రీలంక 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**సుతార్ స్పిన్ మ్యాజిక్**

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు తడబడ్డారు. రిషభ్ పంత్ (66 బంతుల్లో 69), పడిక్కల్ (44), రాహుల్ (35) మినహా ఎవరూ రాణించకపోవడంతో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు తీశారు. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక మరోసారి తడబడింది. 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే, ధనంజయ డిసిల్వా (59), సోనల్ దినుష (84) మరోసారి పోరాడి 91 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, మానవ్ సుతార్ తన స్పిన్‌తో మాయ చేశాడు. కేవలం 10 బంతుల వ్యవధిలో లోయర్ ఆర్డర్‌ను కుప్పకూల్చి శ్రీలంక పతనాన్ని శాసించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6/55 గణాంకాలతో అదరగొట్టడంతో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా, సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఈ అద్భుత ప్రదర్శనతో మానవ్ సుతార్ మ్యాచ్ హీరోగా నిలిచాడు.

## ట్రెండ్‌గా మారుతున్న జాంబీ సినిమాలు!


స్టైలిష్ గ్రే క్రాప్ టాప్ లుక్‌లో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్న ప్రియాంక ఖోల్గాడే




సాంప్రదాయక రూపంలో శ్రియా శరణ్ కాలాతీతమైన హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చిత్ర పరిశ్రమలో ఎప్పటికప్పుడు కొత్త జోనర్స్ తెరపైకి వస్తున్నాయి. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడానికి దర్శకులు విభిన్నమైన కాన్సెప్ట్‌లతో ప్రయోగాలు చేస్తున్నారు. ఆ కోవలోనే కొన్ని సంవత్సరాల క్రితం టాలీవుడ్‌లో ప్రశాంత్ వర్మ అద్భుతమైన సృజనాత్మకతతో తెరకెక్కించిన –జాంబీ రెడ్డి– సినిమాతో హర్రర్–కామెడీ జాంబీ కాన్సెప్ట్ అధికారికంగా పరిచయమైంది. తెలుగు ప్రేక్షకులకు పూర్తిగా కొత్తనైన జానర్‌ను దర్శకుడు అత్యంత వినోదాత్మకంగా మలచడంతో ఈ ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. –జాంబీ రెడ్డి– సృష్టించిన ట్రెండ్ ఒక చిత్రంతో ఆగిపోకుండా ఇండియన్ స్క్రీన్ మీద సరికొత్త ట్రెండ్‌గా వేగంగా మారుతోంది. భయంతో పాటు కడుపుబ్బా నవించే కామెడీని మిక్స్ చేసి తెరకెక్కించే జాంబీ జోనర్‌పై నేటి యువ ప్రేక్షకులు మంచి ఆసక్తి చూపిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలకు మాత్రమే పరిమితం అనుకున్న జాంబీ కాన్సెప్ట్‌ను భారతీయ నైటివిటీకి తగ్గట్టుగా మార్చి తెరపై ఆవిష్కరిస్తుండటంతో మేకర్స్‌కు కూడా కొత్త అవకాశాలు కలుగుతున్నాయి. ఈ విజయవంతమైన బాటలోనే ఇప్పుడు మరిన్ని భారీ ప్రాజెక్ట్‌లు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతున్నాయి. –జాంబీ రెడ్డి– చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న –జాంబీ రెడ్డి 2–పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఈసారి మరింత విస్తృతమైన గ్రాఫిక్స్ .. వినోదంతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం కంటే రెండవ భాగం మరింత వైవిధ్యంగా ఉంటుందని ప్రేక్షకులను సీట్లలో కూర్చోబెట్టేలా అదిరిపోయే హర్రర్–కామెడీ ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది. ఇక బాలీవుడ్‌లోనూ జాంబీ జోనర్ జోరు భారీగా పెరిగింది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం –ప్రళయ్– కూడా ఇదే కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న చిత్రం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. రణ్‌వీర్ సింగ్ లాంటి స్టార్ హీరో ఈ జోనర్‌లో నటిస్తుండటంతో సినిమాపై జాతీయ స్థాయిలో భారీ హైప్ క్రియేట్ అవుతుంది. మరోవైపు కోలీవుడ్‌లోనూ ఈ ట్రెండ్ జోరుగా కొనసాగుతోంది. ప్రభుదేవా .. నవ్వుల రారాజు వడివేలు ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న –బ్యాంగ్ బ్యాంగ్– సినిమా కూడా జాంబీ కామెడీ నేపథ్యంలోనే రూపొందుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న హర్రర్–కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులకు అంతులేని నవ్వులను పంచడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకరికొకరు పూర్తిగా భిన్నమైన శైలి కలిగిన ఇద్దరు దిగ్గజాలు జాంబీలతో చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం పక్కా. మొత్తంగా ప్రశాంత్ వర్మ విత్తిన జాంబీ రెడ్డి చిన్న మొక్క నేడు ఇండియన్ సినిమా పరిశ్రమలో పెద్ద వృక్షలా ఎదిగుతోందన్నది కాదనలేని నిజం. రొటీన్ లవ్‌స్టోరీలు, యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఇలాంటి ప్రయోగాత్మక జాంబీ కాన్సెప్ట్‌లను ప్రేక్షకులు ఆదరిస్తుండటం శు భపరిణామం. రాబోయే రోజుల్లో భారతీయ తెరపై జాంబీ సినిమాల జోరు మరింత పెరిగి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965